# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | గురువారం - 17 - సెప్టెంబర్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 104 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



## 22ఏ భూముల
# సమస్యలు పరిష్కరిస్తం

### 30 రోజుల్లో నిర్ణయాలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హామీ

హైపవర్ అధికారుల కమిటీ ఏర్పాటు

నిరుపేదల ఆస్తుల రక్షణకు చర్యలు

12 కీలక అంశాలపై కార్యాచరణ ప్రకటింపు



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న నిరుపేదల ఆస్తుల సమస్యలకు 30 రోజుల్లోగా న్యాయం జరిగేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రకటించారు. 22ఏ నిషేధిత జాబితాకు సంబంధించిన వివాదాల పరిష్కారం కోసం సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, స్టాంపులురిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులతో కూడిన హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. న్యాయబద్ధమైన అంశాల్లో పేదలకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 22ఏ నిషేధిత

మిగతా 2లో..

## తెలంగాణలో సెమీకండక్టర్ పెట్టుబడుల ఆసక్తి

ముఖ్యమంత్రితో సింగపూర్ ప్రతినిధుల భేటీ.. పారిశ్రామిక పెట్టుబడులపై విస్తృత చర్చలు

ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఆహ్వానం.. సెమీకండక్టర్ పరిశ్రమపై సానుకూల సంకేతాలు

## ప్రభుత్వ ఆస్తుల రక్షణకు చట్టాల ప్రాధాన్యం

- వైఎస్సార్ హయాంలో తీసుకొచ్చిన నిబంధనల ప్రస్తావన
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు
- ప్రజా ఆస్తుల పరిరక్షణపై దృష్టి



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు గతంలో తీసుకొచ్చిన కఠిన చట్టాలు, నిబంధనల ప్రాధాన్యాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. అలాంటి రక్షణాత్మక నిబంధనలు లేకపోయి ఉంటే చార్మినార్, గోల్కొండ కోట వంటి చారిత్రక కట్టడాలకూ ముప్పు ఏర్పడేదని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2లో..



## వరదల నివారణకు చెరువులే రక్షణ

- పట్టణీకరణతో నగరాలకు పెరుగుతున్న వరద ముప్పు
- చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం
- యువ ఆపద మిత్రులు సేవాభావంతో ముందుకు రావాలి
- అక్రమ నిర్మాణాలు కూడా వైపరీత్యాలకు కారణమని హెచ్చరిక
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

2లో

## ధరణిపై సీఎం తీవ్ర విమర్శలు

- భూ దోపిడీ ఆలోచనల నుంచే ధరణి పుట్టిందన్న రేవంత్
- భూముల డేటా మాఫియా చేతికి వెళ్లిందని ఆరోపణ
- ధరణి ద్వారా ఇష్టారాజ్యంగా భూ బదిలీలు జరిగాయన్న వ్యాఖ్య
- అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై సీఎం విమర్శలు

2లో

## హరీశ్‌రావుపై పొంగులేటి ప్రశ్నల వర్షం

- అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై వ్యాఖ్యలు
- పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై ఆరోపణలు
- 22ఏ భూముల అంశంపై కీలక వివరాలు
- అసెంబ్లీ లాబీలో మంత్రి స్పందన




**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):**

మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి విమర్శలు గుప్పించారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని పేర్కొంటూ, అలాంటి పరిస్థితుల్లో హరీశ్‌రావు

మిగతా 2లో..

## అక్టోబర్ 10 నుంచి దసరా సెలవులు

2లో

ఎస్‌ఏ-1 పరీక్షల షెడ్యూల్ విడుదల.. అక్టోబర్ 1 నుంచి 9 వరకు పరీక్షలు.. తరగతుల వారీగా వేర్వేరు పరీక్ష సమయాలు



## నగరాభివృద్ధికి సమగ్ర పరిష్కారాలే మార్గం

- ఢిల్లీలో 'షెహెరోన్ పే చర్చా'లో కేటీఆర్
- ప్రజల కోసం పనిచేసే నగరాలపై చర్చ
- తెలంగాణలో అమలు చేసిన విధానాల ప్రస్తావన
- భారత నగరాల భవిష్యత్‌పై విస్తృత చర్చ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):**

భారత నగరాల అభివృద్ధికి తాత్కాలిక స్పందనల కంటే సమగ్ర పరిష్కారాలపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజలకు అనుకూలంగా నగరాలను తీర్చిదిద్దే అంశంపై నిర్వహించిన 'షెహెరోన్ పే చర్చా' కార్యక్రమంలో ఆయన ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.bన్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో జనాగ్రహ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. దేశంలోని నగరాలు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎలా పనిచేయాలనే అంశంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నిపుణులు పాల్గొని అభిప్రాయాలు పంచుకున్నారు. మహువా మాజి, ఎస్ నిరంజన్ రెడ్డి, జనాగ్రహ ప్రధాన కార్యనిర్వాహక అధికారి

మిగతా 2లో..

## ఉద్యాన పంటలకు 1000 కోట్ల ప్రోత్సాహం

- అసెంబ్లీలో మంత్రి తుమ్మల వెల్లడి
- ఉద్యాన సాగు విస్తరణపై దృష్టి
- పామాయిల్ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు
- రైతుల ఆదాయ పెంపే లక్ష్యం



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. ఉద్యాన పంటల పరిధిని విస్తరించేందుకు సుమారు రూ.1,000 కోట్ల మేర పెట్టుబడులతో వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఈ విషయాలను

మిగతా 2లో..

## సస్పెన్షన్‌పై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు



- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్
- ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):**

అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ అంశంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేకనే తమను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలంగాణలో సెమీకండక్టర్ పెట్టుబడుల ఆసక్తి

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు చేసే అవకాశాలపై సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖకు చెందిన ఇంధన-వాణిజ్య విభాగం ఆసక్తి వ్యక్తం చేసింది. సింగపూర్ మినిస్ట్రీ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ పర్మనెంట్ సెక్రటరీ ఆగస్టీన్ లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమై పారిశ్రామిక పెట్టుబడులు, ఆర్థిక భాగస్వామ్య అవకాశాలపై చర్చలు జరిపింది. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం, పారిశ్రామిక విధానాలు, మౌలిక సదుపాయాలపై ముఖ్యమంత్రి సమగ్రంగా వివరించారు.సమావేశంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక పరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు, విధాన పరమైన ప్రోత్సాహకాలను వేగంగా అందిస్తామని తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశ్రమలను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని వివరించారు. ఈ సందర్భంగా డిసెంబర్‌లో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆగస్టీన్ లీని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పరిశ్రమల ప్రతినిధులు, ఆర్థిక సంస్థలకు తెలంగాణను ప్రముఖ పెట్టుబడి గమ్యస్థానంగా పరిచయం చేయడమే ఈ సదస్సు లక్ష్యమని పేర్కొన్నారు. సింగపూర్ సంస్థలు ఈ వేదికను వినియోగించుకుని రాష్ట్రంలోని అవకాశాలను పరిశీలించాలని కోరారు.మూసీ పునరుజ్జీవన ప్రణాళికలు, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కార్యక్రమాలను కూడా ముఖ్యమంత్రి ప్రతినిధి బృందానికి వివరించారు. తొలి దశలో మూసీ, ఈసా నదుల సంగమ ప్రాంతం నుంచి గాంధీ సరోవర్ వరకు పునరుజ్జీవన పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధితో పాటు రాత్రి ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించే ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్‌ను పర్యాటక కేంద్రంగా మాత్రమే కాకుండా ప్రపంచ స్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు.భారత్ ఫ్యూచర్ సిటీని పర్యావరణహిత నెట్ జీరో నగరంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి అంతర్జాతీయ విద్యాసంస్థలు తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు అంగీకరించిన విషయాన్ని ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. విద్య, పరిశోధన, సాంకేతిక రంగాల్లో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలపై సానుకూలంగా స్పందించిన సింగపూర్ ప్రతినిధి బృందం సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు చేసే అంశాన్ని అనుకూలంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, సింగపూర్ మినిస్ట్రీ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ దక్షిణాసియా సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్, సింగపూర్ కాన్సుల్ జనరల్ విలియం చిక్ తదితరులు పాల్గొన్నారు. ఈ చర్చలు తెలంగాణలో అధునాతన సాంకేతిక పరిశ్రమల పెట్టుబడులకు కొత్త అవకాశాలు తెరచే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

# 22ఏ భూముల సమస్యలు పరిష్కరిస్తం

(మొదటి పేజీ తరువాయి)

జాబితాపై జరిగిన స్వల్పకాలిక చర్చకు సమాధానంగా ముఖ్యమంత్రి భూముల చట్టాల చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. నిజాం పాలన కాలం నుంచి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటువరకు భూ చట్టాల్లో జరిగిన మార్పులు, వాటి ప్రభావాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. భూముల రికార్డులు, యాజమాన్య హక్కులు, నిషేధిత జాబితాలకు సంబంధించిన సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములకు సంబంధించి కొత్త విధానాన్ని తీసుకురానున్నట్లు సీఎం ప్రకటించారు. పాక్షికంగా క్రమబద్ధీకరించిన, క్రమబద్ధీకరణ పొందని కాలనీల సమస్యలను పరిష్కరించడంతో పాటు పాత, కొత్త దరఖాస్తులన్నింటికీ వర్తించే విధంగా పథకాన్ని రూపొందించనున్నట్లు తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ ప్రక్రియలను ఏకకాలంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. అధీకృత లేఅవుట్లలోని ప్రభుత్వ భూములు, సింగరేణి బొగ్గు గని ప్రాంతాల భూములు, జీవో నంబర్ 59, జీవో నంబర్ 118కు సంబంధించిన పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థలు, కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పెండింగ్ దరఖాస్తులన్నింటినీ నిర్దిష్ట గడువులో పరిష్కరించి అర్హత కలిగిన ఆస్తులను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు.అసైన్డ్ భూముల్లో నిర్మించిన గృహాలు, ఇందిరమ్మ పథకం కింద నిర్మించిన ఇళ్ల అంశాలపై సమగ్ర న్యాయపరమైన సమీక్ష చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. లబ్ధిదారుల సొంత స్థలాల్లో నిర్మించిన ఇళ్లకు ఐదేళ్ల గడువు పూర్తయిన తర్వాత క్రయవిక్రయాలకు అనుమతి కల్పిస్తామని పేర్కొన్నారు. అలాగే నాలా రుసుములు చెల్లించని ప్రైవేటు పట్టా భూముల విషయంలో కూడా ప్రత్యేక విధానం అమలు చేయనున్నట్లు వివరించారు.

ప్రభుత్వ భూముల్లో ఏర్పడిన అనధికార లేఅవుట్లు, కాలనీలు, సికింద్రాబాద్ పరిధిలోని లీజ్ హోల్డ్ ఆస్తులు, స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులు, భూదాన్ భూములకు సంబంధించిన అంశాలపై కూడా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు సీఎం వెల్లడించారు. సమగ్ర భూ సమీకరణ విధానం ద్వారా భూములు, వనరులను సమీకరించి బలహీన వర్గాల గృహ నిర్మాణ కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారానికి ఇది కీలక అడుగుగా నిలుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# అక్టోబర్ 10 నుంచి దసరా సెలవులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులకు విద్యాశాఖ కీలక ప్రకటన చేసింది. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (ఎస్‌ఏ-1) పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. అదే సమయంలో దసరా సెలవుల తేదీలను కూడా ప్రకటించింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పరీక్షల నిర్వహణకు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకునే అవకాశం లభించింది. విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 1వ తేదీ నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు ఎస్‌ఏ-1 పరీక్షలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఆదర్శ, సంక్షేమ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులందరికీ ఈ షెడ్యూల్ వర్తించనుంది. పరీక్షల అనంతరం విద్యార్థులకు దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 10వ తేదీ నుంచి అక్టోబర్ 22వ తేదీ వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. పండుగ వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడిపేందుకు విద్యార్థులకు ఈ విరామం ఉపయోగపడనుంది. సెలవులు ముగిసిన అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. పరీక్షల నిర్వహణలో సౌలభ్యం కోసం తరగతుల వారీగా వేర్వేరు సమయాలను నిర్ణయించారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఆరో, ఎనిమిదో తరగతుల విద్యార్థులకు ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు ఉంటాయి.

ఏడో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1:15 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1:15 గంటల నుంచి సాయంత్రం 4:15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు పరీక్షల సమయం నిర్ణయించారు. తరగతుల వారీగా అన్ని సబ్జెక్టుల పరీక్ష తేదీలతో కూడిన పూర్తి టైమ్‌టేబుల్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చినట్లు విద్యాశాఖ తెలిపింది. ప్రకటించిన షెడ్యూల్‌కు అనుగుణంగా విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఉపాధ్యాయులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

# హరీశ్‌రావుపై పొంగులేటి ప్రశ్నల వర్షం

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబానికి సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్‌ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి, అసైన్డ్ భూములకు అనుమతులు ఇవ్వడం చట్టబద్ధం కాదని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వం అలాంటి నిర్ణయం తీసుకున్నా అది తప్పేనని స్పష్టం చేశారు. ఈ విషయం తెలిసి కూడా ఇప్పుడు ప్రశ్నలు లేవనెత్తడం సరైందేనా అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్‌ఓసీ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. ఈ అంశంపై కూడా ప్రభుత్వం పరిశీలన జరుపుతోందని తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్ విషయంలో చట్టవిరుద్ధ చర్యలు జరిగితే వాటిపై చర్యలు తప్పవని పేర్కొన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్‌కు సంబంధించిన భూముల వ్యవహారాన్ని కూడా మంత్రి ప్రస్తావించారు. నిషేధిత భూములకు సంబంధించి హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ జరిగినట్లు ఆరోపించారు. ప్రభుత్వ భూములను ఏ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని మరోసారి స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత భూముల జాబితాపై కూడా మంత్రి కీలక వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం ఆ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలినవి ప్రభుత్వ భూములేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలను తొలగించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించామని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ వ్యవహారాలపై పూర్తి వివరాలను త్వరలోనే ప్రజల ముందుకు తీసుకువస్తామని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 22ఏ భూముల అంశంపై ప్రభుత్వం సమగ్ర పరిశీలన నిర్వహిస్తోందని, అవసరమైన నిర్ణయాలను త్వరలో ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. కాగా, ఇవన్నీ మంత్రి పొంగులేటి చేసిన ఆరోపణలు, వ్యాఖ్యలేనని, సంబంధిత వ్యక్తుల స్పందన వెలువడాల్సి ఉంది.

# ఉద్యాన పంటలకు 1000 కోట్ల ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. వ్యవసాయ రంగంలో వైవిధ్యీకరణకు ఉద్యాన పంటలు కీలకమని మంత్రి పేర్కొన్నారు. సంప్రదాయ పంటలతో పాటు పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్యాల సాగును ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సాగు విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు సాంకేతిక సహాయం, నాణ్యమైన నాట్ల పంపిణీ, సాగునీటి వసతుల కల్పన, ఆధునిక పద్ధతుల ప్రోత్సాహం వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. పామాయిల్ సాగు విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. పామాయిల్ రైతులకు మార్కెట్ సౌకర్యాలు కల్పించడంతో పాటు శుద్ధి కర్మాగారాల ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. దీంతో రైతులకు మెరుగైన ధరలు లభించడమే కాకుండా పరిశ్రమల అభివృద్ధికి కూడా ఊతం లభిస్తుందని అన్నారు.

రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే పామాయిల్‌ను స్థానికంగానే ప్రాసెస్ చేసే విధంగా శుద్ధి కర్మాగారాల ఏర్పాటు ప్రణాళికలో ఉందని మంత్రి తెలిపారు. ఈ కర్మాగారాల ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. రైతుల నుంచి పరిశ్రమల వరకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఉద్యాన పంటల విస్తరణ, విలువ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి ద్వారా రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, ఉత్పత్తుల విలువను పెంచడం, ఎగుమతి అవకాశాలను విస్తరించడం ద్వారా ఉద్యాన రంగాన్ని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక భాగంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# సస్పెన్షన్‌పై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని నిలదీయకుండా అడ్డుకోవడానికే ఈ చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. సస్పెన్షన్ ఎత్తివేస్తే ప్రభుత్వ వైఖరిని ఆధారాలతో సహా సభలో బయటపెడతామని ఇప్పటికే చెప్పామని హరీశ్‌రావు గుర్తు చేశారు. అయినప్పటికీ తమపై విధించిన సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఎత్తివేయకపోవడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని అన్నారు. ప్రజల తరఫున ప్రశ్నలు లేవనెత్తే ప్రతిపక్ష స్వరాన్ని అణిచివేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ ప్రశ్నలను ఎదుర్కొనే పరిస్థితిలో లేరని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వ పనితీరు, వివిధ అంశాలపై తాము లేవనెత్తబోయే విషయాలు బయటకు రాకుండా ఉండేందుకే తమను సభకు దూరం చేశారని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష పాత్రను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దలకు సంబంధించిన అంశాలపై తాము మాట్లాడతామని చెప్పిన తర్వాతే సస్పెన్షన్ కొనసాగించారని హరీశ్‌రావు ఆరోపించారు. తమ వద్ద ఉన్న సమాచారం బయటకు వస్తుందనే భయంతోనే ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియకుండా చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు.

అసెంబ్లీ ప్రజాస్వామ్య చర్చలకు వేదిక కావాలని, ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. విభిన్న అభిప్రాయాలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రజల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి సభా కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం కల్పించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత అధికార పక్షంపై ఉందని ఆయన అన్నారు.

# వరదల నివారణకు చెరువులే రక్షణ: రంగనాథ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో నగరాల్లో వరదల ముప్పు పెరుగుతోందని, ప్రాణ, ఆస్తి నష్టాల నివారణలో ప్రభుత్వ శాఖలతో పాటు యువ ఆపద మిత్రులు కూడా కీలక పాత్ర పోషించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. నాగోలులోని హైడ్రా శిక్షణ కేంద్రంలో యువ ఆపద మిత్ర ఐదో బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి శిక్షణార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని సహజ నీటి వనరులు, చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని తెలిపారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఉపగ్రహ చిత్రాల ప్రకారం నగరంలోని 69 శాతం చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని వెల్లడించారు. చెరువులను పరిరక్షిస్తే వరదల ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. అందుకే చెరువుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత స్పందించే విధానానికి భిన్నంగా, ముందస్తు నివారణ చర్యలే హైడ్రా ప్రధాన లక్ష్యమని కమిషనర్ వివరించారు. పర్యావరణ పరిరక్షణ ద్వారా ప్రకృతి విపత్తులకు అవకాశమే లేకుండా చూడాలని హైడ్రా కృషి చేస్తోందన్నారు. భారీ వర్షాల సమయంలో వరద నీరు నాలాల ద్వారా చెరువులకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నాలాలు, చెరువుల అభివృద్ధి వల్ల వరదలను నియంత్రించవచ్చని ఇప్పటికే పలు ప్రాంతాల్లో రుజువైందని రంగనాథ్ పేర్కొన్నారు. నగరాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు నీటి పారుదల వ్యవస్థలను బలోపేతం చేయడం అత్యవసరమని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. సమాజ సేవా దృక్పథంతో ముందుకు వచ్చిన యువ ఆపద మిత్రులు అభినందనీయులని రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన 117 మంది విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించి సంబంధిత ప్రభుత్వ శాఖలకు సమాచారం అందిస్తూ నష్ట నివారణలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, అదనపు కమిషనర్లు ఆర్. సుదర్శన్, డి. ఆనంద్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ధరణిపై సీఎం తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** ధరణి పోర్టల్‌పై శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్‌ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత కేసీఆర్ కన్ను భూములపై పడిందని ఆరోపించిన ఆయన, భూ దోపిడీకి సంబంధించిన ఆలోచనల నుంచే ధరణి అనే వ్యవస్థ పుట్టిందని అన్నారు. ప్రస్తుతం అది తెలంగాణ సమాజాన్ని పీడిస్తున్న భూతంగా మారిందని వ్యాఖ్యానించారు. ధరణి వ్యవస్థను తానే రూపొందించానని కేసీఆర్ గతంలో చెప్పుకున్నారని, అయితే అది పూర్తిగా అసత్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రెవెన్యూ సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌ఐసీకి కాకుండా ప్రైవేటు సంస్థలకు ఎందుకు అప్పగించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ధరణి అమలులో పలు అనుమానాలు ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని బీఆర్‌ఎస్ నేతలు ఇష్టానుసారంగా భూముల బదిలీలు చేసుకున్నారని ముఖ్యమంత్రి ఆరోపించారు. 2021 నాటికి 21 లక్షల 93 వేల 50 ఎకరాలను పార్ట్‌బి కింద నిషేధిత జాబితాలో చేర్చారని, ఈ ప్రక్రియలో అనేక సమస్యలు తలెత్తాయని అన్నారు. ధరణి వల్ల భూముల యాజమాన్య వివాదాలు పెరిగాయని పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన సుమారు 2.5 కోట్ల ఎకరాల భూముల సమాచారాన్ని మాఫియా చేతుల్లోకి వెళ్లేలా చేశారని సీఎం ఆరోపించారు. ధరణి కాంట్రాక్టు విలువ, అమలు విధానంపై కూడా పలు ప్రశ్నలు లేవనెత్తారు. అసెంబ్లీలో ఈ అంశాలపై చర్చ జరుగుతున్న సమయంలో బీఆర్‌ఎస్ సభ్యులు సభలో లేకపోవడాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తాము లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే సభకు దూరంగా ఉన్నారని ఆరోపించారు. ధరణి వ్యవస్థకు సంబంధించిన అన్ని అంశాలను ప్రజల ముందుకు తీసుకువస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రభుత్వ ఆస్తుల రక్షణకు చట్టాల ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా ఆస్తుల సంరక్షణలో చట్టాల పాత్ర ఎంత కీలకమో ఈ సందర్భంగా వివరించారు. ఆనాటి వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్తులను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్న విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ప్రభుత్వ భూములు, చారిత్రక కట్టడాలు, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన ఆస్తులు అనధికారికంగా బదిలీ కాకుండా నిరోధించే విధంగా నిబంధనలు అమలులోకి తీసుకువచ్చారని చెప్పారు.

ఈ సందర్భంగా గతంలో జరిగిన ఒక ఉదాహరణను ప్రస్తావిస్తూ, ఒక వ్యక్తి చార్మినార్‌ను రిజిస్ట్రేషన్ చేయాలని కోరిన సంఘటన గురించి పేర్కొన్నారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వద్దకు వచ్చి చార్మినార్, గోల్కొండ కోటలను కూడా రిజిస్ట్రేషన్ చేయాలని అడిగే పరిస్థితులు వచ్చేవని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఆస్తులపై స్పష్టమైన చట్టపరమైన రక్షణ లేకపోతే విలువైన చారిత్రక, సాంస్కృతిక సంపదలు ప్రైవేటు వ్యక్తుల పేరిట నమోదు అయ్యే ప్రమాదం ఉండేదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అలాంటి పరిస్థితులను నివారించడానికే గతంలో కఠిన నిబంధనలు తీసుకువచ్చినట్లు తెలిపారు.

చార్మినార్, గోల్కొండ వంటి చారిత్రక కట్టడాలు కేవలం నిర్మాణాలు మాత్రమే కాకుండా తెలంగాణ చరిత్ర, సంస్కృతికి ప్రతీకలని ఆయన పేర్కొన్నారు. వాటి పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా సమాజం మొత్తానికి సంబంధించిన అంశమని అన్నారు. ప్రజా ఆస్తులు, చారిత్రక వారసత్వ సంపదలను భవిష్యత్ తరాలకు అందించాలంటే చట్టబద్ధమైన రక్షణ వ్యవస్థలు మరింత బలోపేతం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ఆయన తెలిపారు.

# నగరాభివృద్ధికి సమగ్ర పరిష్కారాలే మార్గం

(మొదటి పేజీ తరువాయి)

శ్రీకాంత్ విశ్వనాథన్‌తో కలిసి జరిగిన ప్యానెల్ చర్చలో కేటీఆర్ పాల్గొన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ పాలన సమయంలో నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రజా సేవల మెరుగుదల కోసం అమలు చేసిన పలు విధానాలు, కార్యక్రమాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో నగరాల నిర్వహణకు దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమని చర్చలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రవాణా, పారిశుధ్యం, తాగునీరు, గృహ నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను సమగ్రంగా పరిగణించి అభివృద్ధి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. భారత నగరాలు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందాలంటే ప్రజల భాగస్వామ్యం, సమర్థ పరిపాలన, ఆధునిక సాంకేతికత వినియోగం కీలకమని పాల్గొన్నవారు పేర్కొన్నారు. నగరాల అభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని కూడా ప్రస్తావించారు. దేశంలోని నగరాలను మరింత జీవనోపయోగకరంగా, సుస్థిరంగా మార్చే దిశగా చేపట్టాల్సిన చర్యలపై కార్యక్రమంలో విస్తృత చర్చ జరిగింది. ప్రజల అవసరాలను కేంద్రంగా చేసుకుని రూపొందించే విధానాలే భవిష్యత్ నగరాల అభివృద్ధికి బలమైన పునాది అవుతాయని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

## మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన బాల్య మిత్రులు



**జఫర్గడ్, సెప్టెంబర్ 16.(తెలంగాణ ముచ్చట్లు):** మండలం లోని తమ్మడపల్లి జీ గ్రామానికి చెందిన రంగు శివ గౌడ్(25) ఇటీవల హఠాత్మరణం చెందగా శివ చిన్ననాటి మిత్రులు (10వ తరగతి 2014_2015 బ్యాచ్) వారి కుటుంబానికి సాయంగా రూ 15,000అందజేశారు.

## ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసిన ఎడ్ల కుమార్



**చిల్పూర్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని జనగామ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ నూతన అధికార ప్రతినిధి ఎడ్ల కుమార్ మంగళవారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనను జనగామ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధిగా నియమించడంలో సహకరించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఎడ్ల కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి ఎడ్ల కుమార్‌ను అభినందించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు దళిత వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చిల్పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

## నమిలిగొండలో వీబీజీ రామ్ జీ రెండో గ్రామసభ

- మూడేళ్ల అభివృద్ధి ప్రణాళికపై ప్రజలతో చర్చ



**స్టేషన్ ఘన్ పూర్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని నమిలిగొండ గ్రామ పంచాయతీలో బుధవారం వీబీజీ రామ్ జీ పథకంలోని రెండో విడత గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ పురమాని కోమల ఐలోని అధ్యక్షతన జరిగిన ఈ సభలో గ్రామ అభివృద్ధికి అవసరమైన మూడేళ్ల ప్రణాళికపై ప్రజలతో విస్తృతంగా చర్చించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం, ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన సన్నకారు రైతుల పొలాల్లో వ్యవసాయ బావుల వద్ద వ్యవసాయ కుంటల ఏర్పాటు, పంట పొలాల మధ్య నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ప్రాంతాల్లో కల్వర్టుల నిర్మాణం వంటి పనులను ప్రతిపాదించారు.

అలాగే ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లేందుకు అవసరమైన అనుసంధాన రహదారులకు కంకర నిర్మాణం చేపట్టడం, రైతులు తమ పొలాలకు సులభంగా చేరుకునేందుకు మట్టి రోడ్ల నిర్మాణం, వాటిపై కంకర వేయడం వంటి పనులను కూడా గ్రామసభలో ప్రతిపాదించారు.

గ్రామసభలో ప్రజలు సూచించిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయానికి పంపనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం అర్హత ఉన్న పనులకు త్వరలోనే అనుమతులు మంజూరు చేస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, క్షేత్ర సహాయకుడు, గ్రామ సంస్థల సహాయకులు, రైతులు, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోతలు లేకుండా రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలి



- పెద్దమందడి మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి

**పెద్దమందడి,సెప్టెంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** రైతులకు కోతలు లేకుండా 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని మాజీ జడ్పీటీసీ రఘుపతి రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు విద్యుత్ కోతలతో సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్‌లో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా రఘుపతి రెడ్డి మాట్లాడుతూ.. రైతు పక్షపాతి ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పంటలను కాపాడుకోవాలంటే నిరంతర విద్యుత్ సరఫరా ఎంతో అవసరమని అన్నారు.వెల్టూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సుమారు 12 గ్రామాల రైతులకు కోతలు లేకుండా 24 గంటల విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించి రైతుల పంటలను కాపాడాలని కోరారు.అనంతరం మండల విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## దొరలు, భూస్వాముల దోపిడీ నుంచి తెలంగాణను విముక్తి చేసిన పోరాటం

- చరిత్రను వక్రీకరిస్తే ప్రజలే తిప్పికొడతారు
- ఇప్పగూడెం సభలో ఎం.డి. అబ్బాస్, సూడి కృష్ణారెడ్డి




**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** నిజాం నిరంకుశ పాలన, దొరలు-భూస్వాముల దోపిడీ, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగం సాగించిన వీరోచిత పోరాట చరిత్రను వక్రీకరించి మతపరమైన రంగు పులమాలని చూస్తున్న భారతీయ జనతా పార్టీ ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి. అబ్బాస్, రాష్ట్ర సీనియర్ నాయకులు సూడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.

స్టేషన్ ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామంలో బుధవారం రాత్రి సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సభ నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఇర్రి అహల్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎం.డి. అబ్బాస్, సూడి కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. తొలుత సూడి కృష్ణారెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆనాడు తెలంగాణలో భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, దొరల చేతుల్లో రైతులు, కూలీలు తీవ్ర దోపిడీకి గురయ్యారని అన్నారు. వెట్టి చాకిరీ, అధిక కౌలు, బలవంతపు వసూళ్లు, మహిళలపై అత్యాచారాలు, రైతులను భూముల నుంచి వెళ్లగొట్టడం వంటి దుర్మార్గాలకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ పేరుతో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో ప్రజలు సంఘటితమయ్యారని తెలిపారు. 1946లో ప్రారంభమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 1951 వరకు కొనసాగిందని పేర్కొన్నారు.

ఆంధ్ర మహాసభ ద్వారా కమ్యూనిస్టులు గ్రామస్థాయికి పోరాటాన్ని తీసుకెళ్లి వెట్టి నిర్మూలన, దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాన్ని బలోపేతం చేశారని నాయకులు గుర్తుచేశారు. 1946లో కమ్యూనిస్టులు నాయకత్వ స్థానాల్లోకి వచ్చి గ్రామస్థాయిలో సంఘాలను ఏర్పాటు చేసి రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించారని తెలిపారు.

తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో కమ్యూనిస్టుల పాత్రను చెరిపివేయడం ఎవరి తరమూ కాదని అన్నారు. వేలాది గ్రామాల్లో రైతాంగం సంఘటితమై దొరల దోపిడీకి ఎదురు నిలిచిందని, వెట్టి చాకిరీని వ్యతిరేకించి భూమి సమస్యను ముందుకు తెచ్చిందని పేర్కొన్నారు. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో తెలంగాణ ప్రాంతంలో సుమారు పది లక్షల ఎకరాల భూమి పంచినట్లు, మూడు వేల గ్రామాలను గ్రామ రాజ్యాలుగా నిర్మించినట్లు తెలిపారు.

సెప్టెంబర్ 17 నాటి చరిత్రను కేవలం హిందూ-ముస్లిం ఘర్షణగా చిత్రీకరించడం చరిత్రకు అన్యాయం చేయడమేనని భారతీయ జనతా పార్టీ నాయకులపై విమర్శలు చేశారు. తెలంగాణ రైతాంగ పోరాటం కేవలం మతానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం కాదని, నిరంకుశ పాలనతోపాటు భూస్వామ్య దోపిడీ, వెట్టి చాకిరీ, రైతులపై జరిగిన అణచివేతకు వ్యతిరేకంగా సాగిన విస్తృత ప్రజా పోరాటమని అన్నారు.

ఆ పోరాటంలో ప్రజల పక్షాన నిలిచింది ఎవరు, రైతుల కష్టాల్లోకి వెళ్లింది ఎవరు, దొరల దోపిడీకి ఎదురు నిలిచింది ఎవరు అనే ప్రశ్నలకు చరిత్రే సమాధానం చెబుతుందని అన్నారు. నేటి రాజకీయ ప్రయోజనాల కోసం ఆనాటి పోరాటంలో లేని శక్తులకు చరిత్రలో పాత్రను ఆపాదించడం సరికాదని విమర్శించారు.

తమ అభిప్రాయం ప్రకారం ఆ కాలంలో ఒక్క ఆర్ఎస్ఎస్ నాయకుడు కూడా రైతాంగ సాయుధ పోరాటంలో భాగస్వామ్యం కాలేదని, ప్రజల వెట్టి బాధలు, భూస్వాముల దోపిడీపై ఆ సంస్థ నాయకత్వం ప్రజల పక్షాన నిలబడలేదని వారు విమర్శించారు.

ఆనాటి కాంగ్రెస్ వైఖరిని కూడా చరిత్రను సమగ్రంగా పరిశీలించి అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని నాయకులు అన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన అనంతరం రైతాంగ పోరాటాన్ని అణచివేసేందుకు సైనిక చర్యలు జరిగాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో పలువురు కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మొత్తం పోరాటంలో సుమారు నాలుగు వేల మంది అమరులయ్యారని పేర్కొన్నారు.

కమ్యూనిస్టులు తరిమికొట్టిన దొరలను అనంతరం కాంగ్రెస్ ఆధ్వర్యంలో తిరిగి గ్రామాల్లోకి తీసుకువచ్చారని నాయకులు విమర్శించారు. తెలంగాణ రైతాంగ పోరాటానికి సంబంధించిన చారిత్రక అంశాలను నేటి యువత అధ్యయనం చేయాలని పిలుపునిచ్చారు.

రైతులు, కూలీలు, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన అమర వీరుల త్యాగాలను స్మరించుకోవడమే వారోత్సవాల ఉద్దేశమని తెలిపారు. ఆనాటి పోరాట స్ఫూర్తితో నేటి ప్రజా సమస్యలపై కూడా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, రాపర్తి సోమయ్య, మండల కార్యదర్శి మునిగెల రమేష్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, ఎం.డి. షబానా, గుండెబోయిన రాజు, ఎం.డి. అసరుద్దీన్, సుంచు విజేందర్, మండల కమిటీ సభ్యులు కుర్ర ఉప్పలయ్య, కత్తుల రాజు, గట్ల మల్లారెడ్డి, తోడంగల ఐలయ్య, మంద మహేందర్, పోలాసు పరమేష్, ఉపసర్పంచ్ లింగనబోయిన రాజు, కడుదుల నర్సిరెడ్డి, వంగపండ్ల సోమయ్య, రామగోని సతీష్, పోలాసు కిష్టయ్య, దాసరి కొమురయ్య, బోయిని రాజు, మారబోయిన మల్లయ్య, గొడిశాల యాదగిరి, దైద కుమార్, సట్ల రాజు, లింగనబోయిన కుమార్, శ్రీకాంత్, మంద మొగిలి, పోలాసు పద్మాకర్, నీరటి సంపత్, కాసాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టిక అల్పాహారం

- కరీంనగర్ మార్కెట్ యార్డులో భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం



**కరీంనగర్, సెప్టెంబర్ 16(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొన్నారు.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన కిచెన్‌లో ఇడ్లీ, దోశ, పూరీ, సాంబార్, బోండా తయారీ యంత్రాలు, పాత్రలు శుభ్రం చేసే యంత్రాలు, పాల కేంద్రం, ఆహార పదార్థాల నాణ్యత పరీక్షల ల్యాబ్, కూరగాయలు కోసే-కడిగే యంత్రాలు, చట్నీ పౌడర్ తయారీ యంత్రాలను ప్రారంభించి వాటి పనితీరును పరిశీలించారు. ఆయా విభాగాల పనితీరుపై అధికారులు, నిర్వాహకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కౌంటియా దాస స్వామీజీ, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న, కార్పొరేటర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## భగత్‌నగర్ అభివృద్ధికి రూ.60 లక్షలు

- ఆధునిక ఓపెన్ జిమ్ ప్రారంభం
- సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శ్రీకారం

**కరీంనగర్, సెప్టెంబర్ 16(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ 42వ డివిజన్ భగత్‌నగర్‌లో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. మమత థియేటర్ ఎదురుగా సిఎస్ఆర్ నిధులతో మలయప్ప ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఆధునిక ఓపెన్ జిమ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ప్రారంభించారు. యువత, మహిళలు, వయోవృద్ధులు వ్యాయామం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు ఓపెన్ జిమ్ ఉపయోగపడుతుందని వారు తెలిపారు. అనంతరం యుఐడీఎఫ్ నిధులు రూ.60 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. కాలనీల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. కరీంనగర్ అభివృద్ధికి కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకువస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## టెండర్ల నిబంధనల్లో పారదర్శకత ఏదీ?

- పైపుల కంపెనీలకే అవకాశం కల్పించేలా నిబంధనలు
- అధికారులపై చర్యలు తీసుకోవాలి: హరిప్రసాద్




**కరీంనగర్, సెప్టెంబర్ 16(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ నగరపాలక సంస్థలో టెండర్ల ప్రక్రియపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆరోపించారు. డి.బి. సెక్షన్ నిబంధనలు ప్రతిసారీ వివాదాలకు తావిస్తున్నాయని, ప్రస్తుతం పిలిచిన వాటర్ పైప్‌లైన్ టెండర్‌లో రిజిస్టర్డ్ కాంట్రాక్టర్లకు కాకుండా పైపుల తయారీ సంస్థలకు అనుకూలంగా ఉండేలా నిబంధనలు రూపొందించారని ఆయన విమర్శించారు. గతంలో సుమారు రూ.45 లక్షల విలువైన ఇదే తరహా పైప్‌లైన్ పనిని తయారీదారు అనే నిబంధన లేకుండా టెండర్ నిర్వహించగా సుమారు 28 శాతం తక్కువకు టెండర్ దక్కిందని, దీంతో నగరపాలక సంస్థకు సుమారు రూ.12 లక్షల మేర ఆదా జరిగిందని హరిప్రసాద్ పేర్కొన్నారు. అదే పనికి సంబంధించిన ప్రస్తుత టెండర్‌లో నిబంధనలు ఎందుకు మార్చారో అధికారులు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. నిబంధనల మార్పు వెనుక ఆర్థిక లావాదేవీలు జరిగాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. టెండర్లలో పోటీని పరిమితం చేసే నిబంధనలు విధించడం వల్ల ప్రజలకు, నగరపాలక సంస్థకు నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. నిబంధనల మార్పు మేయర్, కమిషనర్‌కు తెలిసే జరిగిందా? లేక ఇంజనీరింగ్ అధికారుల స్థాయిలోనే నిర్ణయం తీసుకున్నారా? అనే విషయాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. టెండర్ ప్రక్రియను నిలిపివేసి, ఎక్కువ మంది అర్హులైన కాంట్రాక్టర్లు పాల్గొనే విధంగా నిబంధనలు రూపొందించాలని కోరారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వకపోతే విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసి ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో రంగరవేణి లక్ష్మణ్ ముదిరాజ్, కుతాడి శ్రీనివాస్, బసవేణి రాజేందర్, గర్షకుర్తి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



- **తహశీల్దార్ కు బిజెపి నాయకుల వినతి**

**చిల్పూర్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సెప్టెంబర్ 17న అధికారికంగా నిర్వహించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు చిల్పూర్ తహసిల్దార్ విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందరరావు, జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటె ఉపేందర్ యాదవ్ మాట్లాడుతూ దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం లభించగా, తెలంగాణ ప్రాంతం 1948 సెప్టెంబర్ 17న నిజాం పాలన నుంచి విముక్తి పొందిందన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం అధికారికంగా విమోచన దినోత్సవాన్ని నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. ప్రజల చారిత్రక ఆకాంక్షను గౌరవిస్తూ సెప్టెంబర్ 17న ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా వేడుకలు నిర్వహించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పెండ్యాల దిలీప్ కుమార్, జిల్లా ప్రచార విభాగం కన్వీనర్ కాడగయా రమేష్, ఇతర వెనుకబడిన తరగతుల విభాగం జిల్లా కార్యవర్గ సభ్యుడు ముక్కెర రమేష్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి వెలిశాల శ్రీనివాస్, నాయకులు కన్నెబోయిన అశోక్ యాదవ్, కట్ల అనిల్ కుమార్, బోసు నాయక్, పిట్టల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ నిషేధిత జాబితా నుంచి పట్టా భూములను తొలగించాలి



- **టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుధాకర్ నాయుడు**

**వనపర్తి,సెప్టెంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న ప్రైవేటు, పట్టా భూములు, ఇంటి స్థలాలను వెంటనే ఆ జాబితా నుంచి తొలగించి, వాటి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పి. సుధాకర్ నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆయన నేతృత్వంలో పార్టీ నాయకులతో కలిసి వనపర్తి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సుధాకర్ నాయుడు మాట్లాడుతూ.. 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన అనేక ప్రైవేటు, పట్టా భూములు, ఇంటి స్థలాలకు సంబంధించిన యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమ సొంత భూములను విక్రయించుకోవడానికి, అవసరమైనప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.భూముల రికార్డులను అధికారులు సమగ్రంగా పరిశీలించి, నిషేధిత జాబితాలో ఉండాల్సిన అవసరం లేని ప్రైవేటు, పట్టా భూములను గుర్తించి 22ఏ జాబితా నుంచి తొలగించాలని కోరారు. అర్హత కలిగిన భూముల రిజిస్ట్రేషన్లకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను విజ్ఞప్తి చేశారు.భూమి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సుధాకర్ నాయుడు కోరారు. ప్రజల ఆస్తి హక్కులకు సంబంధించిన సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు.అనంతరం సుధాకర్ నాయుడు, పార్టీ నాయకుల సమక్షంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కన్వీనర్ బి. రాములు, శ్రీనివాసరెడ్డి, చిట్యాల బాలరాజు, కే. లక్ష్మయ్య, ఆవుల శ్రీను, సితార, యాదయ్య, రమేష్ సింగ్, రాఘవేందర్ గౌడ్, శివ, సత్యం, ఫారుక్, శివయ్యచారి, ఉపేందర్, అప్పాయిపల్లి బాలయ్య, డి. బాలరాజు, కే. గిరి, శంకర్, రాజు, దాసు తదితర గ్రామ, మండల స్థాయి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# వరి, వేరుశనగ పంటల్లో చీడపీడలపై క్షేత్ర పరిశీలన

- **రైతులకు నివారణ చర్యలపై శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు**



**పెద్దమందడి,సెప్టెంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, వనపర్తి, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పెద్దమందడి మండలం వీరాయిపల్లిలో వరి, వేరుశనగ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతు విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త ఎన్. నవత, మండల వ్యవసాయ అధికారి సైదులు యాదవ్ రైతుల పొలాలను సందర్శించి పంటల ఎదుగుదల, చీడపీడలు, వ్యాధులు, పోషక లోపాలను పరిశీలించారు. వరి పంటలో పొటాష్ లోపం, బ్యాక్టీరియా ఆకు ఎండుతెగులు, నల్లి, కాండం తొలిచే పురుగు ఉధృతిని గుర్తించారు. వేరుశనగలో రసాన్ని పీల్చే తామర పురుగుల ఉధృతి ఉన్నట్లు తెలిపారు. వీటి నివారణకు తగిన మందులు, పురుగు ఆకర్షణ ఉచ్చులు, పసుపు రంగు అంటుకునే ఉచ్చులను వినియోగించాలని రైతులకు సూచించారు. పంటలను నిరంతరం పరిశీలిస్తూ చీడపీడలు, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించాలని సూచించారు. సకాలంలో విత్తడం, విత్తన శుద్ధి చేయడం, వ్యవసాయ శాఖ సూచించిన మందులను మాత్రమే వినియోగించడం ద్వారా పంటలను కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# రైతులకు కరెంట్ ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- **24 గంటల విద్యుత్ కోసం జగదీశ్వర్ రెడ్డి డిమాండ్**



**పెద్దమందడి,సెప్టెంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జిల్లా మాజీ రైతుబంధు అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి విమర్శించారు. రైతులకు కోతలు లేకుండా 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ ఆయన ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు పెద్దమందడి మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతు పక్షపాతి ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల విద్యుత్ సమస్యను పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యుత్ కోతల కారణంగా పంటలకు సకాలంలో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో కరెంట్ అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించిందని జగదీశ్వర్ రెడ్డి ఆరోపించారు. రైతులు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలను కాపాడుకోవాలంటే నిరంతర విద్యుత్ సరఫరా తప్పనిసరి అని అన్నారు. విద్యుత్ కోతలను వెంటనే నిలిపివేసి రైతులకు 24 గంటల నాణ్యమైన కరెంట్ అందించాలని డిమాండ్ చేశారు. మండలంలోని వ్యవసాయ ఆధారిత గ్రామాల్లో విద్యుత్ సరఫరాను మెరుగుపరచి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ మరింత బలంగా పోరాటం చేస్తుందని జగదీశ్వర్ రెడ్డి అన్నారు.అనంతరం బీఆర్ఎస్ నాయకులు మండల విద్యుత్ శాఖ ఏఈని కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 24 గంటల్లో హత్య కేసు ఛేదన

- **చాకచక్యంగా దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్న జమ్మికుంట పోలీసులు**



**జమ్మికుంట, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** భూ వివాదం నేపథ్యంలో తనుగుల గ్రామంలో జరిగిన హత్య కేసును జమ్మికుంట పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. పట్టణ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు చాకచక్యంగా దర్యాప్తు చేపట్టి, ఘటనకు సంబంధం ఉన్న నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

పోలీసుల విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. తనుగుల గ్రామానికి చెందిన బొజ్జపల్లి రాజబాబుకు తన తల్లి లచ్చమ్మకు చెందిన భూమి విషయంలో కుటుంబ సభ్యులతో కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. భూమిని విక్రయించాలని రాజబాబు కోరగా కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో తరచూ గొడవలు జరిగేవని పోలీసులు తెలిపారు. గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి భూమిని మూడు వాటాలుగా పంచాలని నిర్ణయించినప్పటికీ, రాజబాబు మొత్తం భూమి తనకే చెందాలని పట్టుబట్టినట్లు విచారణలో వెల్లడైంది.

ఈ క్రమంలో సెప్టెంబర్ 10న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో రాజబాబు మద్యం సేవించి తనుగులలోని తన బావ జూపాక శంకర్ ఇంటికి వెళ్లాడు. అక్కడ ఉన్న తన తల్లి లచ్చమ్మ, అక్క కవితతో గొడవకు దిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ సమయంలో రాజబాబు తన తల్లి వెంట్రుకలు పట్టుకుని లాగడంతో ఘర్షణ తీవ్రరూపం దాల్చినట్లు పేర్కొన్నారు.

అప్పటికే మద్యం సేవించి ఉన్న జూపాక శంకర్, చేతి వెంకటేష్, మారపెల్లి రాజయ్య, జూపాక సతీష్ తదితరులు రాజబాబును పట్టుకుని కొట్టి మంచంపై పడవేసినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం అతని చేతులు, కాళ్లను మంచానికి కట్టినట్లు పోలీసులు తెలిపారు. ఆ తర్వాత జూపాక శంకర్ చున్నీతో రాజబాబు మెడను బిగించడంతో అతడు మృతి చెందినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు పేర్కొన్నారు.

మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్లు..

రాజబాబు మృతి చెందినట్లు నిర్ధారించుకున్న అనంతరం ఘటనను దాచిపెట్టేందుకు మృతదేహాన్ని దుప్పటిలో చుట్టినట్లు పోలీసులు తెలిపారు. అదే రాత్రి మృతదేహాన్ని సైకిల్‌పై తనుగుల గ్రామ శివారులోని పొలానికి తరలించి, అక్కడ పార, గడ్డపారలతో గుంత తవ్వి పూడ్చిపెట్టినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం మట్టితో పాటు తుమ్మ పొరకతో కప్పి ఎవరికి అనుమానం రాకుండా చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

పోలీసుల స్వాధీనంలో వస్తువులు

కేసు దర్యాప్తులో భాగంగా మృతదేహాన్ని పూడ్చేందుకు ఉపయోగించిన పార, గడ్డపార, మృతదేహాన్ని తరలించేందుకు ఉపయోగించిన సైకిల్, రాజబాబు మెడ బిగించేందుకు ఉపయోగించిన చున్నీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, వ్యక్తిగత గొడవల విషయంలో ప్రజలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులను లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించి చట్టపరమైన మార్గంలో సమస్యలను పరిష్కరించుకోవాలని జమ్మికుంట పోలీసులు సూచించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటిన చైర్మన్



**జమ్మికుంట, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** మానవాళి మనుగడకు మొక్కలే ఆధారమని, పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పిలుపునిచ్చారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో వాతావరణ కాలుష్యం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం అత్యంత అవసరమన్నారు. 'అమ్మ జన్మనిస్తే.. చెట్టు పునర్జన్మనిస్తుంది' అనే భావనను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు తమ నివాస ప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. మొక్కలు పెంచడం ద్వారా స్వచ్ఛమైన గాలి లభించడంతో పాటు తమ ఆరోగ్యాన్ని, పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యాన్ని కాపాడినవారవుతారని తెలిపారు.పర్యావరణ పరిరక్షణ అనేది ఒక్కరి బాధ్యత కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే కాలుష్యాన్ని నియంత్రించగలమని అన్నారు. విద్యార్థులు మొక్కలు నాటడాన్ని ఒక కార్యక్రమంగా కాకుండా నిరంతర బాధ్యతగా స్వీకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రమేష్, అధ్యాపకులు ఓదెలు కుమార్, గణేష్, రాజేందర్, రవీందర్‌తో పాటు ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌లో SWF జెండా ఆవిష్కరణ



- **కార్మికుల హక్కుల కోసం పోరాటం**

**హుజూరాబాద్, సెప్టెంబర్ 16(తెలంగాణ ముచ్చట్లు ):** స్టాఫ్ అండ్ వర్కర్ ఫెడరేషన్ (SWF) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం హుజూరాబాద్ ఆర్టీసీ డిపో ప్రాంగణంలో సంఘం 47వ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు వి. రాములు ముఖ్య అతిథిగా హాజరై SWF జెండాను ఆవిష్కరించారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యం

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం SWF నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సంఘం తరఫున కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్యత ఎంతో అవసరమని అన్నారు.

ఐక్యంగా సమస్యలపై పోరాటం

కార్మికుల సమస్యల పరిష్కారంలో సంఘటితంగా పోరాడటం ముఖ్యమని నాయకులు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై యాజమాన్యం, అధికారులు సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై భవిష్యత్తులోనూ SWF ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

47 ఏళ్ల ప్రస్థానం

SWF 47వ జెండా ఆవిష్కరణ సందర్భంగా సంఘం 47 ఏళ్ల ప్రస్థానాన్ని నాయకులు గుర్తుచేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం సంఘం ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తోందని తెలిపారు. కార్మికుల సమస్యలను సమిష్టిగా పరిష్కరించుకునేలా సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

పాల్గొన్న నాయకులు

కార్యక్రమంలో డిపో కార్యదర్శి జి. రమేష్, అసిస్టెంట్ సెక్రటరీ బి. రాజబాబు, కార్యవర్గ సభ్యులు జి. సంపత్, బి. వేణు, సీనియర్ నాయకులు సిహెచ్. సారయ్య, ఏ.ఆర్. రావు తదితరులు పాల్గొన్నారు. కార్మికుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ సంఘం ఆశయాల సాధనకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

# బొమ్మకల్ పాఠశాలలో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ ప్రారంభం

- విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారానికి ప్రాధాన్యం



**సైదాపూర్, సెప్టెంబర్ 16(తెలంగాణ ముచ్చట్లు ):** సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని ZPHS పాఠశాలలో బుధవారం బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎంతో ప్రయోజనం

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వేముల శ్రీకాంత్, ఉపసర్పంచ్ కొంకట పవన్, గుండెల్లి రాజవ్వ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ . మారుతి మాట్లాడుతూ విద్యార్థులకు ఉదయం పూట పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం వల్ల వారి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. పాఠశాల హాజరు పెంపునకు దోహదం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోషకాహారం అందడంతో పాటు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఇటువంటి కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం...

- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం బ్యూరో , సెప్టెంబరు- 16(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రభుత్వం చేపడుతున్న రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం ముదిగొండ మండలం ఖానాపురం గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే ప్రక్రియ ను అదనపు కలెక్టర్ పరిశీలించారు. రీ సర్వే మొత్తం ప్రక్రియ పూర్తిగా క్షేత్ర స్థాయిలో భూ హక్కుదారిని తో పాటు, సరిహద్దు రైతుల సమక్షంలో జరగాలని, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారాన్ని నమ్మకంతో భూ రీసర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి, వివరాలను గ్రామ పంచాయతీ, తహసీల్దారు కార్యాలయాలలో నోటీస్ బోర్డులో ఉంచుతామని, ఏలాంటి అభ్యంతరాలకు గడువు ఇస్తామని, అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. రీసర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ముదిగొండ తహసీల్దారు రవి కుమార్, అధికారులు, రైతులు, భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# టీజేఏ ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎండి రషీద్

- ప్రధాన కార్యదర్శిగా ఎం. చిన్ని ఏకగ్రీవ ఎన్నిక




**ఖమ్మం బ్యూరో , సెప్టెంబర్ 16(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) ఖమ్మం ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీజేఏ రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా అధ్యక్షులు జి. నాగస్వామి ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా ఎండి రషీద్, ప్రధాన కార్యదర్శిగా ఎం. చిన్ని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సందర్భంగా నూతన ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రషీద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి , తనకి పదవీ బాధ్యతలు అందజేసిన సంఘం జిల్లా అధ్యక్షుడు నాగస్వామి లకు కృతజ్ఞతలు ప్రకటించారు. సంఘం బలోపేతం తో పాటు జర్నలిస్టుల సమస్యల సాధనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీనిచ్చారు. టీజేఏ జిల్లా అధ్యక్షుడు నాగస్వామి ప్రత్యేకంగా తనను ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా నియమించడంలో తనపై గల విశ్వాసాన్ని ఏ పరిస్థితుల్లో తాను వమ్ము చేయనని రషీద్ ప్రకటించారు. జర్నలిస్టులు ప్రస్తుతం సంక్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో తమ వృత్తి బాధ్యతలను నిర్వహిస్తున్నారని వారి సేవలను ఖమ్మం ప్రెస్ క్లబ్ అభివృద్ధికి ఉపయోగించుకునే విషయంలో వారి సహకారాన్ని కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఇదే సమయంలో అనుభవాన్ని జీవిత సారాన్ని గ్రహించిన సీనియర్ జర్నలిస్టుల సలహాలు, సూచనలు సహకారంను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సమిష్టి నిర్ణయాలతో ఖమ్మం ప్రెస్ క్లబ్ అభివృద్ధికి , ఖమ్మం జర్నలిస్టుల అభ్యున్నతికి పాటుపడతానని చెప్పారు. అదేవిధంగా తోటి టీజేఏ సభ్యులు, ఇతర జర్నలిస్టులు కూడా ఖమ్మం ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తనతోపాటు పాటుపడే విషయంలో తోడుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ ఖమ్మం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా ఎం. చిన్ని బాధ్యతలు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం,యూనియన్ బలోపేతమే లక్ష్యంగా ముందుకెళ్తానని స్పష్టం చేశారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని, సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ అసోసియేషన్ పురోగతికి కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణలో యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ నాయకులు, ఖమ్మం ప్రెస్ క్లబ్ సభ్యులు మరియు పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎండి రషీద్‌ను టీజేఏ జిల్లా నాయకులు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లా గౌరవ అధ్యక్షులు కే. మణికుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్కే ఖాసిం, జిల్లా ప్రధాన కార్యదర్శి మత్తి రామకృష్ణ, కోశాధికారి బొడపట్ల సతీష్, జిల్లా నాయకులు వాసం రాజేంద్ర ప్రసాద్, నల్లమోతు శ్రీనివాసరావు, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు ఎండి రషీద్, ప్రధాన కార్యదర్శి ఎం. చిన్ని మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సమిష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు.

# పొంగులేటి పై బి ఆర్ఎస్ పార్టీ అనుచిత వ్యాఖ్యలు తగదు

- మేకల మల్లిబాబు యాదవ్




**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 16(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అనేక సంచలనాత్మక నిర్ణయాలతో పాలన చేస్తుంటే, ఓర్వలేని బిఆర్ఎస్ నాయకులు తమ ఉనికిని ఎక్కడ కోల్పోతామో అన్న భయం తో ప్రభుత్వ కీలక నేతలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని, దానిలో భాగంగా రెవిన్యూ వ్యవస్థలో ప్రక్షాళన చేస్తూ ప్రజలకు అతి చేరువవుతున్న ప్రియతమ రాష్ట్ర రెవిన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఈ వ్యాఖ్యలను పొంగులేటి ముఖ్య అనుచరులు, డిసిసిబి డైరెక్టర్ మాజీ జడ్పిటిసి మేకల మల్లిబాబు యాదవ్ తీవ్రంగా ఖండించారు. బుధవారం నాడు జరిగిన పార్టీ కార్యకర్తలు, పొంగులేటి అభిమానుల సమావేశంలో మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ సెంటిమెంట్ ద్వారా అధికారంలోకి వచ్చిన గత టిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని ధ్వంసం చేయడం జరిగిందని 58,59 జీవోలను కొత్తగా ప్రవేశపెట్టి ఎక్కడ ఖాళీ భూములు ఉంటే ఈ జీవో ను ఉపయోగించి టిఆర్ఎస్ నాయకులు భూ కబ్జాలు చేశారని, ₹1,25,000 కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిమయంగామారిందని,టిఆర్ఎస్ పార్టీ వారికి ఏటీఎం గా మారిపోయిందని, ధరణి పేరుతో గ్రామంలో రెవిన్యూ వ్యవస్థను నిర్వీర్యపరచడం జరిగిందని, ధరణి పేరుతో పట్టాలు ఇవ్వకుండా అతి కఠినమైన నిర్ణయాలతో, భూ రిజిస్ట్రేషన్లు జరగలేదని, ఎంతో లోప భూయిష్టంగా ఉన్న ధరణి స్థానంలో అతి సులభంగా సామాన్యులు రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి వీలుగా భూభారతిని ప్రవేశపెట్టడం జరిగిందని, ప్రజలందరికీ పారదర్శకమైన పరిపాలన అందడంతో జీర్ణించుకోలేక, కనీసం అసెంబ్లీకి వచ్చి రాష్ట్ర పరిస్థితులను సభా దృష్టికి తీసుకురాలేని ప్రతిపక్ష నాయకుడు ఉండడం దురదృష్టమని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు తాకనివ్వనని ఛాలెంజ్ చేసి, మాట ఇచ్చిన విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి పై టిఆర్ఎస్ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని, లేనియెడల వారికి తగురీతిలో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉంటుందని, మీరు ఎంత జిమ్మిక్కులు చేసినా మళ్లీ వచ్చేది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బండిపాడు గ్రామపంచాయతీ బాధ్యులు గుగులోతు రవి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాటిబండ్ల ప్రసాద్, బాదావత్ నాగరాజు,వడ్డెర సంఘం మండల అధ్యక్షులు, దేరంగుల తిరపయ్య, బండి ఉపేందర్, తురక బిక్షం మొగిలి శ్రీను, చల్ల మల్లయ్య పగిడిపల్లి రాములు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రజక సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**చిల్పూర్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన రజక సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా బోనగిరి కనకయ్య, వెలిశాల వెంకన్న, ఉపాధ్యక్షుడిగా బోనగిరి కుమార స్వామి, ప్రధాన కార్యదర్శిగా బోనగిరి రంజిత్, కోశాధికారులుగా వెలిశాల శేఖర్, గాజ రవి ఎన్నికయ్యారు.గౌరవ సలహాదారులుగా ఎలిశాల రాజమౌళి, బోనగిరి స్వామి, గౌరవ సభ్యులుగా ఎలిశాల యాదగిరి, బోనగిరి రాములు, వెలిశాల రమేష్, గట్టయ్య, బోనగిరి నగిరి, సమ్మయ్య తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. సంఘ అభివృద్ధికి, రజకుల సంక్షేమానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు.

# విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి



- సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్

**వనపర్తి,సెప్టెంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వనపర్తి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ముందు ఏర్పాటు చేసిన ప్రథమ పూజ్యుడు విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి దివ్య ఆశీస్సులతో ప్రజల సర్వ విఘ్నాలు తొలగి, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. వనపర్తి జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో, ప్రశాంత వాతావరణంలో జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.వినాయక చవితి వేడుకలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఐక్యతతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.అనంతరం శంకర్ గౌడ్‌తో పాటు బైరోజు చంద్రశేఖర్‌ను కౌన్సిలర్ చీర్ల చందర్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కలిసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, బైరోజు చంద్రశేఖర్, డాక్టర్ శామ్ సుందర్, నందిమల్ల రమేష్, శ్రీనివాస్, యుగంధర్, సదానందం గౌడ్, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంచి చదువులు చదువుకోండి.. మీకు అండగా నేను ఉంటా



- రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాజీ ఎంపీ

**కొత్తకోట,సెప్టెంబర్16(తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థులు కష్టపడి మంచి చదువులు చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, వారికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, మాజీ పార్లమెంట్ సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తన తల్లి పద్మమ్మ, సోదరుడు డాక్టర్ వెంకట్ రంగారెడ్డి జ్ఞాపకార్థం రిటైర్డ్ ఉపాధ్యాయులు పలుస శంకర్ గౌడ్‌తో కలిసి బూట్లు, పెన్నులు, పెన్సిల్స్, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతియేటా విద్యార్థులకు బూట్లు అందజేస్తామని తెలిపారు. పాఠశాలలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావడంతో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి భోజనం అందించి, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. కానాయపల్లి వాకింగ్ గ్రూప్ సభ్యులకు యూనిఫామ్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదయ్య సాగర్, సర్పంచ్ బొంతం శిరీష సాయి, ఉప సర్పంచ్ అంజి నాయక్, మాజీ వైస్ ఎంపీపీ వడ్డే శ్రీనివాసులు, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, ఉద్యమకారులు, వాకింగ్ గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఆర్ బి జిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి




**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 16(తెలంగాణ ముచ్చట్లు ):** ఓజోన్ పొరను పరిరక్షించుకోవాలి భావి తరాలకు సమతుల వాతావరణ పరిస్థితులను కానుకగా ఇవ్వాలనుకుంటే ఓజోన్ పొరను పరిరక్షించుకోవాలని ఎస్ఆర్ బిజి ఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా అన్నారు బుధవారం నాడు అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణా దినోత్సవాన్ని పురస్కరించుకుని కెమిస్ట్రీ విభాగం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు సందేశాన్ని అందించారు ఓజోన్ పొర నుండి మనకు హానికరమైన యూవీ కిరణాలు భూమి పై చేరకుండా గొడుగు లా పరిరక్షిస్తూ ఉందని తెలిపారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ విభాగాధిపతి డా.జి.వీరన్న, వైస్ ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి. ఐ.క్యూఏసి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద అధ్యాపకులు డా.చందా సుధాకర్,పి.రామచంద్రరావు,డా.మౌలానా కరీం డా.సలీంపాషా,డా.యు.ఉదయలక్ష్మి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మల్కాపూర్‌లో విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన



- **నేల తల్లి ఆరోగ్యం తెలుసుకుందాం**
- **స్థిర వ్యవసాయానికి బాట వేద్దాం**

**చిల్పూర్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని మల్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల భూసార ఆరోగ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో నేల ఆరోగ్యం, భూసార పరీక్షల ప్రాధాన్యంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టారు.
కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఘన్‌పూర్ స్టేషన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు అపర్ణ మాట్లాడుతూ రైతులు విచక్షణారహితంగా ఎరువులు వినియోగించడం వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువగా ఉంటుందని తెలిపారు. భూసార పరీక్ష చేయించడం ద్వారా పొలంలో ఏ పోషకాలు లోపించాయో తెలుసుకోవచ్చని, వాటి ఆధారంగా ఎరువులు వినియోగిస్తే సాగు ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందని వివరించారు. "ముందు భూసార పరీక్ష – తర్వాతే ఎరువుల వాడకం" అనే నినాదాన్ని ప్రతి రైతు పాటించాలని సూచించారు.
రాజేంద్రనగర్ ప్రాంతీయ భూసార పరీక్ష ప్రయోగశాల నుంచి వచ్చిన వ్యవసాయ అధికారులు వికాస్ పాటిల్, అనురాధ విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణ విధానాన్ని ప్రత్యక్షంగా వివరించారు. పొలంలో జిగ్‌జాగ్ పద్ధతిలో మట్టి నమూనాలను ఎలా సేకరించాలి, భూమిలోని పీహెచ్, విద్యుత్ వాహకత, సేంద్రియ కార్బన్ స్థాయిలను ఎలా గుర్తిస్తారో పరికరాల సహాయంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి కె. నర్సింగా రావు మాట్లాడుతూ విద్యార్థులు రైతు కుటుంబాలకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించే రాయబారులుగా మారాలని అన్నారు. కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను తల్లిదండ్రులకు వివరించి, ప్రతి పొలానికి భూసార పరీక్ష చేయించేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా "భూసార పరీక్షలు చేయించుకుందాం - సమతుల్య ఎరువులు వాడుదాం - నేల ఆరోగ్యాన్ని కాపాడుకుందాం" అని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. శ్రీనివాస్, సమన్వయకర్త ఎస్. కరుణాకర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి ప్రవళిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 22-ఏ నిషేధిత జాబితాలో ప్రైవేట్ పట్టా భూములు, ఇంటి స్థలాలను తొలగించాలి: డా రామనాథం



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 16(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ రాష్ట్ర పార్టీ కార్యాలయం పిలుపు మేరకు ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజకి వినతిపత్రం సమర్పించడం జరిగింది. అనంతరం రామనాథం మాట్లాడుతూ 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న ప్రైవేట్ పట్టా భూములు, ఇంటి స్థలాలను వెంటనే నిషేధిత జాబితా నుంచి తొలగించి, వాటి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని 22ఏ నిషేధిత జాబితాలో పట్టా భూములు, ఇంటి స్థలాలు ఉండటం వల్ల వాటి రిజిస్ట్రేషన్లు జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామాలలో ఈ సమస్య అధికంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడే ఉద్దేశంతో 22ఏ నిషేధిత జాబితాలో ప్రభుత్వ భూములను సబబే కానీ అధికారుల తప్పిదాల కారణంగా ప్రైవేట్, పట్టా భూములు, ఇంటి స్థలాలు కూడా నిషేధిత జాబితాలో చేరడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారని అన్నారు, తరతరాలుగా తమ భూములను అనుభవిస్తూ, పట్టాదారు పాస్‌బుక్ ఇతర హక్కు పత్రాలు కలిగి ఉన్నప్పటికీ 22ఏ జాబితాలో ఉండటం వల్ల భూముల రిజిస్ట్రేషన్లు ఆగాయని తెలిపారు, కావున సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలించి, ప్రభుత్వ భూములు కాని ప్రైవేట్, పట్టా భూములు, ఇంటి స్థలాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రజలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ని కోరామని అన్నారు,
ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండబాల కరుణాకర్, వనమా వాసు, మల్లాది హనుమంతరావు, అరెం వరలక్ష్మి, అరెం రామయ్య, తాత సుధాకర్, నాగార్జున శ్రీను, వాసిరెడ్డి భాస్కరరావు, మందపల్లి కోటి, మంద వెంకటనారాయణ, నూక హనుమంతరావు, మారేడు పుల్లారావు, పాలడుగు కృష్ణప్రసాద్, మేకల సత్యవతి, మందపల్లి రజిని, నల్లమాస మల్లయ్య, నల్లమల శ్రీను, రాయల కోటేశ్వరరావు, అశ్వినీ కుమార్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

# ఆకస్మిక తనిఖీతో అధికారుల్లో అలర్ట్



**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ రవి బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీంతో కార్యాలయ అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించిన అదనపు కలెక్టర్.. అధికారులు నిర్వహిస్తున్న ఫైళ్లు, రికార్డులు, దస్త్రాలను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల వివరాలతో పాటు కార్యాలయ నిర్వహణ, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, దస్త్రాలను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ తనిఖీలో తహసీల్దార్ ప్రసాద్ రావు, డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్ అందరివాడు

- **రాజ్యాంగ నిర్మాతపై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన కురుసపెల్లి రమేష్**

**ధర్మసాగర్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ విలువలను అవమానించడమేనని బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కురుసపెల్లి రమేష్ అన్నారు. అంబేద్కర్ ఒక పార్టీకి, కులానికి లేదా వర్గానికి చెందిన వ్యక్తి కాదని, యావత్ భారతదేశానికి చెందిన మహనీయుడని పేర్కొన్నారు. అంబేద్కర్ సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం చేసిన కృషిని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. ఇటీవల హమారా ప్రసాద్ పేరుతో ప్రచారంలో ఉన్న వ్యాఖ్యలపై పూర్తి విచారణ జరిపి నిజానిజాలను ప్రజల ముందుకు తీసుకురావాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యే కత్తిరించిన దృశ్యాలు, ధృవీకరించని సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఎవరిపైనా తీర్పు ఇవ్వకూడదని సూచించారు. అంబేద్కర్‌ను గౌరవించడం అంటే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, సమానత్వాన్ని గౌరవించడమేనని రమేష్ అన్నారు.
"అంబేద్కర్ ఎవరి సొత్తు కాదు.. అందరివాడు. రాజ్యాంగం ప్రతి భారతీయుడిది. అంబేద్కర్ గౌరవం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్పందించాలి" అని కురుసపెల్లి రమేష్ పిలుపునిచ్చారు.



# భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి విముక్తి కోసం సాగిన మహా పోరాటం



**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగం సాగించిన పోరాటం చరిత్రలో మహత్తరమైనదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఊట్కూరి రాములు అన్నారు. హైదరాబాద్‌లో సెప్టెంబర్ 17న నిర్వహించనున్న తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.
ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాములు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో 4,500 మంది బలిదానాలు చేశారని, పేదలకు సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పంచారని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. "బాంచన్ దొరా.. నీ కాళ్లు మొక్కుతా" అనే బానిసత్వ సంస్కృతి నుంచి "దొర ఏందిరో.. వాణ్ణి పీకుడు ఏందిరో" అనే ఆత్మగౌరవ భావనను ప్రజల్లో నింపిన మహత్తర పోరాటమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం అని రాములు అన్నారు. తెలంగాణ ప్రాంతంలో సాగిన సామాజిక, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిందని తెలిపారు. సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న అమరుల త్యాగాలను స్మరించుకుంటూ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు.
ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, నిమ్మల మనోహర్, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి విజయ్, సీపీఐ ఎల్కతుర్తి మండల సహాయ కార్యదర్శి ఆరెపల్లి చంద్రమౌళి, ఇంజాల పోచయ్య, జూపాక రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో బీజేపీ నేతల వినాయక పూజలు

**ఉప్పల్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకల్లో భాగంగా రెండో రోజు బుధవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ సీనియర్ నాయకులు ధర్మారెడ్డి, గొరిగె కృష్ణ, మహంకాళి లక్ష్మణ్, జి. శ్రీనివాస్ శర్మ, రావుల బాలకృష్ణ, రెడ్డిగారి దేవేందర్ రెడ్డి, సతీష్, కొల్లు బాలరాజు, డివిజన్ అధ్యక్షులు ఎం. పణీందర్, బోరంపేట మురళి, ప్రకాష్ గౌడ్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు ఆకుల రాకేష్, నామ శ్రవణ్, రుషికేష్ తదితరులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వెంకటరామిరెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వి. తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, కార్యనిర్వహణ అధ్యక్షుడు పి. సాగర్, ఉపాధ్యక్షుడు కే. నరోత్తమరెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, సంయుక్త కార్యదర్శి డి. రాజు, సీనియర్ జర్నలిస్టులు పి. మహేందర్‌రెడ్డి, కె. చంద్ర మౌళి, ఎం. శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



# లడఖ్‌లో ఎన్‌సీసీ బాలికల ఘనత

- **అపరాజిత-పరంగ్‌లా యాత్ర విజయవంతం**
- **30 రోజుల్లో 250 కిలోమీటర్ల ప్రయాణం**
- **హిమాచల్ నుంచి లడఖ్ వరకు ట్రెక్కింగ్**
- **కఠిన భౌగోళిక పరిస్థితుల్లో సాహసం**



**లడఖ్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఎన్‌సీసీకి చెందిన 20 మంది బాలికల కేడెట్లు 'అపరాజితపరంగ్‌లా 2026' పేరుతో నిర్వహించిన అత్యంత ఎత్తైన ప్రాంతాల సుదీర్ఘ ట్రెక్కింగ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. హిమాలయ పర్వత శ్రేణుల్లోని అత్యంత క్లిష్టమైన మార్గాలను అధిగమిస్తూ ఈ యువ కేడెట్లు చూపిన ధైర్యసాహసాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఎత్తైన పర్వత ప్రాంతాలు, మంచుతో కప్పబడిన మార్గాలను ఎదుర్కొంటూ వారు లక్ష్యాన్ని చేరుకోవడం విశేషంగా నిలిచింది. ఈ యాత్రలో కేడెట్లు సుమారు 250 కిలోమీటర్ల దూరాన్ని 30 రోజుల వ్యవధిలో పూర్తి చేశారు. అత్యంత ఎత్తైన పర్వత మార్గాలు, హిమానీనదాలు, మంచు మైదానాలు, నదీ లోయలు వంటి సవాళ్లతో కూడిన ప్రాంతాల గుండా ప్రయాణించారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని కూడా పరీక్షించే ఈ యాత్రలో కేడెట్లు క్రమశిక్షణ, పట్టుదల, సమన్వయాన్ని ప్రదర్శించారు.
హిమాచల్ ప్రదేశ్‌లోని కిబ్బర్ ప్రాంతం నుంచి ప్రారంభమైన ఈ ట్రెక్కింగ్ యాత్ర లడఖ్‌లోని కర్జోక్ వద్ద విజయవంతంగా ముగిసింది. మార్గమధ్యంలో అనేక ఎత్తైన కనుమలు, క్లిష్టమైన కొండ దారులు, మంచుతో నిండిన ప్రాంతాలను దాటాల్సి వచ్చింది. ప్రకృతి సవాళ్లను ఎదుర్కొంటూ కేడెట్లు తమ లక్ష్యాన్ని చేరుకోవడం ఎన్‌సీసీ శిక్షణ స్థాయిని ప్రతిబింబిస్తోందని అధికారులు పేర్కొన్నారు. ఈ యాత్రలో కేడెట్లతో పాటు అధికారులు, శిక్షకులు, వైద్య సిబ్బంది, సహాయక బృందాలు కూడా పాల్గొన్నారు. ప్రయాణం మొత్తం కేడెట్ల భద్రత, ఆరోగ్యం, మార్గనిర్దేశం వంటి అంశాలను పర్యవేక్షిస్తూ బృందం సహకారం అందించింది. ఎత్తైన ప్రాంతాల్లో ఆక్సిజన్ కొరత, వాతావరణ మార్పులు వంటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. యువతలో సాహసోపేత భావన, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ఇటువంటి యాత్రల ప్రధాన ఉద్దేశమని ఎన్‌సీసీ అధికారులు తెలిపారు. ప్రకృతితో మమేకమవుతూ కఠిన పరిస్థితుల్లో పనిచేసే సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, జట్టు భావన వంటి విలువలను కూడా ఇటువంటి యాత్రలు బలోపేతం చేస్తున్నాయని వివరించారు. అపరాజితపరంగ్‌లా 2026 యాత్ర విజయవంతంగా పూర్తికావడంతో పాల్గొన్న 20 మంది బాలికల కేడెట్లకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలు సాహస క్రీడలు, కఠిన శిక్షణ కార్యక్రమాల్లోనూ సమర్థవంతంగా రాణించగలరని ఈ యాత్ర మరోసారి నిరూపించింది. భవిష్యత్‌లో మరిన్ని యువతులను ఇటువంటి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడానికి ఈ విజయం ప్రేరణగా నిలవనుందని ఎన్‌సీసీ వర్గాలు పేర్కొన్నాయి.



# రహదారి ప్రమాదాలపై పెరుగుతున్న ఆందోళన



- **నిర్లక్ష్యమే ప్రమాదాలకు ప్రధాన కారణం**
- **చట్టాల అమలులో లోపాల ప్రభావం**
- **భద్రమైన ప్రయాణానికి సమిష్టి బాధ్యత**

**డెస్క్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు)** : రహదారి ప్రమాదాలు నేటి సమాజాన్ని వేధిస్తున్న అత్యంత తీవ్రమైన సమస్యల్లో ఒకటిగా మారాయి. ప్రతి రోజు దేశంలోని ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాల వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. కొందరు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు జీవితాంతం వికలాంగులుగా మిగిలిపోతున్నారు. ఒక ప్రమాదం కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాదు, మొత్తం కుటుంబాన్ని ప్రభావితం చేస్తుంది. కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోతే ఆర్థికంగా, మానసికంగా తీవ్ర నష్టం వాటిల్లుతుంది. అభివృద్ధి, ఆధునికత, వేగం పేరుతో రహదారులపై పెరుగుతున్న నిర్లక్ష్యం ఇప్పుడు ఒక సామాజిక సమస్యగా మారింది. ప్రమాదాలకు ప్రధాన కారణాల్లో అతివేగం మొదటి స్థానంలో నిలుస్తోంది. గమ్యస్థానానికి కొన్ని నిమిషాలు ముందుగా చేరాలనే ఆలోచనతో చాలామంది వాహనదారులు వేగ పరిమితులను పట్టించుకోవడం లేదు. వేగం పెరిగిన కొద్దీ వాహనంపై నియంత్రణ తగ్గిపోతుంది. ఒక చిన్న పొరపాటు కూడా పెద్ద ప్రమాదానికి దారితీస్తుంది. ముఖ్యంగా యువతలో వేగంగా వాహనాలు నడపడం ఒక ప్రదర్శనగా మారడం ఆందోళన కలిగిస్తోంది. వేగమే సామర్థ్యానికి గుర్తు కాదనే విషయాన్ని సమాజం గుర్తించాల్సిన అవసరం ఉంది.

మద్యం సేవించి వాహనాలు నడపడం కూడా ప్రమాదాల సంఖ్య పెరగడానికి మరో ప్రధాన కారణం. మద్యం ప్రభావంలో ఉన్న వ్యక్తి నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని కోల్పోతాడు. రహదారిపై ఎదురయ్యే పరిస్థితులను సకాలంలో అంచనా వేయలేడు. అయినప్పటికీ కొందరు చట్టాలను లెక్కచేయకుండా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారు. దీనివల్ల అమాయకులు కూడా ప్రాణాలు కోల్పోతున్నారు. కఠినమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఈ సమస్య పూర్తిగా అదుపులోకి రావడం లేదు. రహదారి భద్రతా నిబంధనలను పాటించకపోవడం కూడా ప్రమాదాలకు దారితీస్తోంది. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణాలు ధరించకపోవడం, కార్లలో సీటు బెల్టులు ఉపయోగించకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ వాహనాలు నడపడం వంటి అలవాట్లు ప్రమాదాలను మరింత పెంచుతున్నాయి. చాలా మంది నిబంధనలను కేవలం జరిమానాల భయంతో మాత్రమే పాటిస్తున్నారు. కానీ రహదారి నియమాలు ప్రాణాలను కాపాడటానికే రూపొందించబడ్డాయని గుర్తించాలి. భద్రతను ఒక అలవాటుగా మార్చుకోవాలి.

రహదారుల పరిస్థితి కూడా కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు కారణమవుతోంది. గుంతలు, సరైన సూచికల లేమి, వీధి దీపాలు లేకపోవడం, ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం వంటి సమస్యలు వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రహదారుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం, నిర్వహణ పనులను సకాలంలో చేపట్టడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత. వాహనాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ ట్రాఫిక్ క్రమశిక్షణ అదే స్థాయిలో పెరగడం లేదు. ఒకరినొకరు దాటిపోవాలనే తొందర, సిగ్నళ్లను పట్టించుకోకపోవడం, తప్పు మార్గాల్లో ప్రయాణించడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. రహదారిపై ప్రతి ఒక్కరూ తమ హక్కుల గురించి మాత్రమే కాకుండా బాధ్యతల గురించి కూడా ఆలోచించాలి. ఒకరి నిర్లక్ష్యం మరొకరి ప్రాణాన్ని బలి తీసుకోవచ్చనే అవగాహన అవసరం.

ప్రమాదాల తర్వాత వైద్య సేవలు అందడంలో జాప్యం కూడా మరణాల సంఖ్య పెరగడానికి కారణమవుతోంది. ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర వైద్య సహాయం అందితే అనేక ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది. అందుకోసం అత్యవసర సేవలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ప్రజల్లో కూడా ప్రమాద బాధితులకు సహాయం చేయాలనే బాధ్యత పెరగాలి. సమయానికి అందే సహాయం ఒక ప్రాణాన్ని నిలబెట్టగలదు. పాఠశాల స్థాయి నుంచే రహదారి భద్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన పెరిగితే భవిష్యత్తులో బాధ్యతాయుతమైన వాహనదారులుగా ఎదుగుతారు. అవగాహన కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు, ప్రచార కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి. కేవలం చట్టాలు సరిపోవు, ప్రజల్లో చైతన్యం కూడా అవసరం.

రహదారి ప్రమాదాలకు బాధ్యత ఎవరిది అనే ప్రశ్నకు ఒకే సమాధానం లేదు. వాహనదారులు, పాదచారులు, రహదారుల నిర్మాణ సంస్థలు, ట్రాఫిక్ అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం, వాహన తయారీ సంస్థలు——అందరికీ తమ వంతు బాధ్యత ఉంది. ఒక వ్యవస్థలోని చిన్న లోపం కూడా ప్రమాదానికి కారణం కావచ్చు. అందువల్ల సమస్యను ఒక కోణంలో మాత్రమే చూడడం సరైంది కాదు. రహదారి ప్రమాదాలు అనివార్యమైనవి కావు. సరైన అవగాహన, క్రమశిక్షణ, నాణ్యమైన మౌలిక సదుపాయాలు, కఠినమైన చట్ట అమలు ఉంటే ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చు. ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగియాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. రహదారి మీద వేగం కంటే ప్రాణం విలువైనదని గుర్తించినప్పుడే ప్రమాదాల సంఖ్య తగ్గి భద్రమైన సమాజం వైపు అడుగులు పడతాయి.

## మానసిక ఆరోగ్యానికి ముప్పుగా

# వాయు కాలుష్యం

- **సూక్ష్మ ధూళి కణాలపై హెచ్చరిక**
- **బలవన్మరణ ఆలోచనల పెరుగుదల**
- **పర్యావరణ మార్పులపై శాస్త్రవేత్తల దృష్టి**
- **నివారణ వ్యూహాల్లో కొత్త సూచనలు**



డెస్క్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు) రోజురోజుకి పెరుగుతున్న వాయు కాలుష్యం మానవ ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతోందని ఇప్పటికే అనేక అధ్యయనాలు వెల్లడించగా, తాజాగా మానసిక ఆరోగ్యంపై కూడా దీని ప్రభావం ఆందోళనకర స్థాయిలో ఉన్నట్లు కొత్త పరిశోధన తెలిపింది. గాలిలోని సూక్ష్మ ధూళి కణాలు, విష వాయువులకు అధికంగా గురికావడం వల్ల బలవన్మరణ ఆలోచనలు, మానసిక ఒత్తిడి సంబంధిత సమస్యలు పెరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. వాయు కాలుష్యాన్ని కేవలం శ్వాసకోశ వ్యాధుల సమస్యగా కాకుండా సమగ్ర ప్రజారోగ్య సవాలుగా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. యూకేలోని క్వీన్స్ యూనివర్శిటీ బెల్ఫాస్ట్‌కు చెందిన పరిశోధనా బృందం నిర్వహించిన అధ్యయనంలో గాలిలో ఉండే సూక్ష్మ ధూళి కణాలు మరియు నైట్రోజన్ డయాక్సైడ్ వంటి కాలుష్య కారకాలు మానసిక ఆరోగ్యంపై చూపే ప్రభావాన్ని విశ్లేషించారు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన 29 వేర్వేరు అధ్యయనాల ఫలితాలను సమీక్షించి ఈ నిర్ధారణలకు వచ్చారు. దీర్ఘకాలంగా కాలుష్య వాతావరణంలో జీవించే ప్రజల్లో మానసిక సమస్యలు ఎక్కువగా కనిపించే అవకాశముందని పరిశోధకులు గుర్తించారు. ప్రత్యేకంగా పీఎం 2.5, పీఎం 10 వంటి సూక్ష్మ ధూళి కణాలు మానవ శరీరంలోకి ప్రవేశించి రక్తప్రసరణ వ్యవస్థతో పాటు మెదడు పనితీరుపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని అధ్యయనం పేర్కొంది. ఇవి శరీరంలో వాపు సంబంధిత ప్రతిచర్యలను పెంచడం ద్వారా మానసిక ఆరోగ్య సమస్యలకు దారితీసే పరిస్థితులను సృష్టించవచ్చని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. కాలుష్యం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఆందోళన, నిరాశ, ఒత్తిడి వంటి సమస్యలు ఎక్కువగా నమోదవుతున్నాయని కూడా వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా పట్టణీకరణ, వాహనాల పెరుగుదల, పరిశ్రమల విస్తరణ కారణంగా వాయు కాలుష్యం వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా పెద్ద నగరాల్లో గాలి నాణ్యత రోజురోజుకి క్షీణిస్తుండటంతో ప్రజల ఆరోగ్యంపై దీర్ఘకాల ప్రభావాలు కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధులు, క్యాన్సర్ వంటి సమస్యలతో వాయు కాలుష్యానికి సంబంధం ఉన్నట్లు తెలిసినా, మానసిక ఆరోగ్యంపై ప్రభావం కూడా తీవ్రంగా ఉండొచ్చని తాజా అధ్యయనం సూచిస్తోంది.

పరిశోధన ఫలితాలు తాజాగా వైద్య రంగంలో ప్రాముఖ్యత కలిగిన 'జర్నల్ ఆఫ్ ఎపిడెమియాలజీ అండ్ కమ్యూనిటీ హెల్త్' పత్రికలో ప్రచురితమయ్యాయి. అయితే కాలుష్యం ఒక్కటే బలవన్మరణాలకు ప్రత్యక్ష కారణమని ఈ అధ్యయనం చెప్పడం లేదని పరిశోధకులు స్పష్టం చేశారు. సామాజిక, ఆర్థిక, వ్యక్తిగత పరిస్థితులతో పాటు పర్యావరణ అంశాలు కూడా మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపే కారకాలలో ఒకటిగా పరిగణించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో బలవన్మరణ నివారణ చర్యలను రూపొందించే సమయంలో పర్యావరణ మార్పులను కూడా ముఖ్య అంశంగా పరిగణించాలని పరిశోధకులు సూచించారు. స్వచ్ఛమైన గాలి, పచ్చదనం పెంపు, కాలుష్య నియంత్రణ చర్యలు కేవలం శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ఆరోగ్య రక్షణకు కూడా తోడ్పడవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రజారోగ్య విధానాల్లో వాయు కాలుష్య నియంత్రణకు మరింత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని అధ్యయనం వెల్లడించింది.

# విశ్వకర్మ జయంతి శ్రమకు సత్కారం

- **సృష్టి శిల్పికి అంకితమైన రోజు**
- **పనిముట్ల పూజ వెనుక భావన**
- **నైపుణ్యానికి గౌరవం తెలిపే సంప్రదాయం**
- **ఆధునిక యుగంలో విశ్వకర్మ ప్రాధాన్యం**



**డెస్క్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** భారతీయ సంస్కృతిలో శ్రమకు, నైపుణ్యానికి, సృజనాత్మకతకు విశిష్ట స్థానం ఉంది. మనిషి నాగరికత అభివృద్ధి చెందడంలో పనిముట్లు, యంత్రాలు, కళలు, నిర్మాణాలు కీలక పాత్ర పోషించాయి. ఈ సృజనాత్మక శక్తికి ప్రతీకగా భావించే దేవశిల్పి విశ్వకర్మను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం విశ్వకర్మ జయంతి లేదా విశ్వకర్మ పూజను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కార్మికులు, ఇంజనీర్లు, మెకానిక్‌లు, వడ్రంగులు, శిల్పులు, కళాకారులు, పరిశ్రమల కార్మికులు తమ పనిముట్లు, యంత్రాలను పూజించి కృతజ్ఞతలు తెలియజేస్తారు. శ్రమకు గౌరవం ఇవ్వాలనే సందేశాన్ని ఈ పండుగ సమాజానికి అందిస్తుంది.

పురాణాల ప్రకారం విశ్వకర్మ దేవతలకు రాజప్రాసాదాలు, ఆయుధాలు, దివ్యనగరాలు నిర్మించిన దేవశిల్పిగా వర్ణించబడ్డాడు. ఇంద్రుడి అమరావతి, ద్వారకానగరం, లంకానగరం వంటి అనేక అద్భుత నిర్మాణాలకు విశ్వకర్మనే రూపకర్తగా పురాణాలు చెబుతాయి. ఈ కథలు కేవలం ఆధ్యాత్మిక విశ్వాసాలకే పరిమితం కాకుండా నిర్మాణ నైపుణ్యం, సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనలకు ప్రతీకలుగా కూడా భావించబడుతున్నాయి. అందుకే విశ్వకర్మను శిల్పకళ, వృత్తి నైపుణ్యాల అధిదేవతగా పూజిస్తారు. విశ్వకర్మ పూజలో ప్రధానంగా పనిముట్లు, యంత్రాలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. రైతులు తమ వ్యవసాయ పరికరాలను, మెకానిక్‌లు తమ పనిముట్లను, పరిశ్రమలు యంత్రాలను, వాహన యజమానులు తమ వాహనాలను అలంకరించి పూజిస్తారు. ఇవి కేవలం ఉపాధికి సాధనాలు మాత్రమే కాకుండా కుటుంబాల జీవనాధారంగా భావిస్తారు. వాటి ద్వారా జీవనం సాగిస్తున్నందుకు కృతజ్ఞత భావంతో పూజ నిర్వహించడం ఈ సంప్రదాయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. శ్రమను పవిత్రంగా చూడాలనే భావన ఇందులో ప్రతిఫలిస్తుంది. మన దేశ ఆర్థిక వ్యవస్థలో కార్మికుల పాత్ర అత్యంత కీలకమైనది. భారీ పరిశ్రమల నుంచి చిన్న వర్క్‌షాప్‌ల వరకు, నిర్మాణ రంగం నుంచి కళారంగం వరకు ప్రతి చోటా వారి కృషి కనిపిస్తుంది. అయితే అనేక సందర్భాల్లో శ్రమ విలువకు తగిన గుర్తింపు లభించడం లేదు. విశ్వకర్మ జయంతి ఈ వాస్తవాన్ని గుర్తు చేస్తూ శ్రమజీవుల కృషిని గౌరవించాల్సిన అవసరాన్ని సమాజానికి తెలియజేస్తుంది. దేశ నిర్మాణంలో వారి పాత్ర ఎంత గొప్పదో ఈ రోజు మరోసారి గుర్తుచేస్తుంది. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో నైపుణ్యాల ప్రాధాన్యం మరింత పెరిగింది. పరిశ్రమలు, సమాచార సాంకేతిక రంగం, యాంత్రిక రంగం, నిర్మాణ రంగం వంటి విభాగాల్లో నిపుణుల అవసరం పెరుగుతోంది. యువత కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలను పెంచుకోవచ్చు. విశ్వకర్మ జయంతి నైపుణ్యాభివృద్ధి ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ యువతకు ప్రేరణగా నిలుస్తుంది. చేతివృత్తులు, సాంకేతిక విద్య, శిక్షణ కార్యక్రమాలకు ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ రోజు సూచిస్తుంది. భారతదేశంలో అనేక సంప్రదాయ వృత్తులు తరతరాలుగా కొనసాగుతున్నాయి. వడ్రంగులు, కమ్మరులు, శిల్పులు, బంగారు పనివారు, నేత కార్మికులు వంటి అనేక వర్గాలు తమ ప్రత్యేక నైపుణ్యాలతో సమాజానికి సేవలందిస్తున్నాయి. అయితే ఆధునిక జీవనశైలి, యాంత్రీకరణ ప్రభావంతో కొన్ని సంప్రదాయ వృత్తులు కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాటిని సంరక్షించడం, ప్రోత్సహించడం అత్యంత అవసరం. విశ్వకర్మ జయంతి ఈ సంప్రదాయ వృత్తుల విలువను గుర్తుచేసే సందర్భంగా నిలుస్తోంది. పరిశ్రమల అభివృద్ధిలో భద్రత కూడా కీలక అంశం. యంత్రాలతో పని చేసే కార్మికులు, సాంకేతిక నిపుణులు, ఇంజనీర్లు ప్రమాదాల నుంచి రక్షణ పొందేందుకు భద్రతా ప్రమాణాలను పాటించాలి. పనిస్థలాల్లో సురక్షిత వాతావరణం కల్పించడం యాజమాన్యాల బాధ్యత. విశ్వకర్మ పూజ సందర్భంగా అనేక పరిశ్రమలు భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం కూడా కనిపిస్తుంది. ఇది కార్మికుల సంక్షేమానికి సానుకూల సంకేతంగా భావించవచ్చు. సృజనాత్మకత, ఆవిష్కరణ, కృషి కలిసి సమాజ పురోగతికి దోహదపడతాయి. చిన్న పనిముట్టు నుంచి భారీ యంత్రం వరకు ప్రతి ఆవిష్కరణ వెనుక మనిషి మేధస్సు, శ్రమ, నైపుణ్యం దాగి ఉంటుంది. విశ్వకర్మ జయంతి ఈ విలువలను గుర్తుచేస్తూ సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం ఇస్తుంది. సమాజ అభివృద్ధికి అవసరమైన సాంకేతిక పురోగతికి శిల్పులు, ఇంజనీర్లు, కార్మికులు అందిస్తున్న సేవలను గుర్తు చేస్తుంది. ప్రపంచీకరణ యుగంలో పోటీ పెరుగుతున్న నేపథ్యంలో నైపుణ్యాల ఆధారిత విద్యకు మరింత ప్రాధాన్యం లభిస్తోంది. కేవలం విద్యార్హతలు మాత్రమే కాకుండా పనిలో ప్రావీణ్యం కూడా అవసరమవుతోంది. ప్రభుత్వాలు కూడా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో విశ్వకర్మ జయంతి యువతలో వృత్తి నైపుణ్యాలపై ఆసక్తిని పెంచే అవకాశాన్ని కల్పిస్తోంది. శ్రమకు గౌరవం ఇచ్చే సమాజం మాత్రమే స్థిరమైన అభివృద్ధిని సాధించగలదనే విషయాన్ని గుర్తు చేస్తోంది. విశ్వకర్మ జయంతి కేవలం ఒక ఆధ్యాత్మిక వేడుక మాత్రమే కాదు. శ్రమకు, సృజనాత్మకతకు, నైపుణ్యానికి, కృషికి సమాజం నివాళులర్పించే ప్రత్యేక సందర్భం. దేశ అభివృద్ధికి పునాదిగా నిలిచే కార్మికులు, ఇంజనీర్లు, శిల్పులు, కళాకారుల సేవలను గుర్తు చేసుకునే రోజు. ప్రతి పనిని గౌరవంగా చూడడం, ప్రతి వృత్తికి విలువ ఇవ్వడం, ప్రతి నైపుణ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా మాత్రమే సమాజం మరింత ముందుకు సాగగలదు. విశ్వకర్మ జయంతి అదే సందేశాన్ని తరతరాలకు అందిస్తూ శ్రమ గొప్పతనాన్ని చాటుతోంది.

# మెటాపై కేంద్రం కఠిన వైఖరి

- **సాధారణ మధ్యవర్తి కాదన్న కేంద్రం**
- **కంటెంట్‌పై మరింత బాధ్యత అవసరం**

**న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటాపై కేంద్ర ప్రభుత్వం కీలక వ్యాఖ్యలు చేసింది. వినియోగదారులకు ఏ సమాచారం ఎక్కువగా కనిపించాలి, ఏ కంటెంట్ విస్తృతంగా చేరాలి అనే అంశాలను అల్గారిథమ్‌ల ద్వారా ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో మెటాను కేవలం సాధారణ మధ్యవర్తి సంస్థగా పరిగణించలేమని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. కేవలం సమాచారాన్ని చేరవేసే వేదికగా కాకుండా సేవలందించే సంస్థగా వ్యవహరిస్తున్నందున దానికి మరింత బాధ్యత ఉంటుందని స్పష్టం చేశాయి. సామాజిక మాధ్యమ వేదికల ద్వారా కోట్లాది మంది ప్రజలకు సమాచారం చేరుతున్న నేపథ్యంలో సంస్థలు తమ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందని కేంద్రం అభిప్రాయపడుతోంది. కంటెంట్ వ్యాప్తిలో ప్రత్యక్ష పాత్ర పోషిస్తున్న సంస్థలు ప్రజలపై చూపే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని చట్టపరమైన ప్రమాణాలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో మెటా భవిష్యత్తులో మరింత జవాబుదారీతనంతో వ్యవహరించాల్సి ఉంటుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సామాజిక మాధ్యమ సంస్థలకు లభించే చట్టపరమైన రక్షణ అంశం కూడా ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మెటా తన వేదికలోని కంటెంట్ వ్యాప్తిని నియంత్రిస్తున్న పరిస్థితుల్లో సాధారణంగా లభించే రక్షణ వర్తింపుపై సందేహాలు ఉన్నాయని కేంద్ర వర్గాలు పేర్కొన్నాయి. అయితే దీనిపై తుది నిర్ణయం న్యాయస్థానాల పరిధిలోనే ఉంటుందని, కోర్టులు తీసుకునే నిర్ణయమే అమలులోకి వస్తుందని స్పష్టం చేశాయి. ఇటీవల చిన్నారుల భద్రతకు సంబంధించిన అంశాల్లో మెటా తన వేదికలో ఉన్న లోపాలను గుర్తించి చర్యలు చేపట్టేందుకు ముందుకు వచ్చినట్లు సమాచారం. ముఖ్యంగా చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన అభ్యంతరకర కంటెంట్‌ను గుర్తించడం, నివేదించడం వంటి అంశాల్లో మరింత కఠిన విధానాలు అమలు చేయనున్నట్లు సంస్థ వెల్లడించింది. దీనివల్ల ఆన్‌లైన్ వేదికల భద్రతను బలోపేతం చేయడం సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇకపై చిన్నారుల భద్రతకు సంబంధించిన అనుమానాస్పద అంశాలను నేరుగా భారత సైబర్ నేరాల పోర్టల్‌కు తెలియజేయడానికి మెటా అంగీకరించినట్లు కేంద్ర వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకు విదేశీ సంస్థలకు నివేదికలు పంపుతున్న విధానానికి బదులుగా భారత చట్ట అమలు సంస్థలకు నేరుగా సమాచారం అందించనుంది. దీనివల్ల దర్యాప్తు ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు నేరస్తులపై త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఏర్పడుతుందని అధికారులు భావిస్తున్నారు. భారత్‌లో ఆన్‌లైన్ భద్రత, చిన్నారుల రక్షణ, తప్పుడు సమాచార నియంత్రణ, కృత్రిమ మేధస్సుతో రూపొందించే మోసపూరిత కంటెంట్ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రత్యేక దృష్టి సారించింది. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో మెటా సహా ఇతర సామాజిక మాధ్యమ సంస్థలు కూడా తమ విధానాలను పునఃసమీక్షించి భారత చట్టాలకు అనుగుణంగా మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలంగాణ విమోచన చరిత్ర ప్రదర్శన ప్రారంభం





- పరేడ్ గ్రౌండ్స్‌లో ఫోటో గ్యాలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం
- అమరవీరుల త్యాగాలను గుర్తు చేసిన ఈటెల రాజేందర్
- భావితరాలకు చరిత్రను చేరవేయాలన్న లక్ష్యం

**సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీ ఎగ్జిబిషన్‌ను మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావుతో కలిసి ఈటెల రాజేందర్ ప్రారంభించారు. తెలంగాణ విమోచన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల చరిత్రను నేటి తరానికి తెలియజేయాలనే లక్ష్యంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణ చరిత్రను ఎవరూ దాచలేరని, త్యాగాలతో కూడిన పోరాట గాథలను భావితరాలకు అందించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు అనుభవిస్తున్న స్వేచ్ఛ అనేక మంది అమరవీరుల త్యాగాల ఫలితమని అన్నారు. దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య వేడుకలు జరుపుకున్నప్పటికీ తెలంగాణలో మాత్రం 1948 సెప్టెంబర్ 17న నిజాం పాలన ముగిసిన తర్వాతే మువ్వన్నెల జెండా ఎగిరిందని గుర్తు చేశారు. స్వేచ్ఛ కోసం వేలాది మంది ప్రజలు పోరాడారని, వారి త్యాగాలను ఎప్పటికీ మరువరాదన్నారు.

నిజాం పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, స్వేచ్ఛగా మాట్లాడే హక్కు కూడా లేకుండా పరిస్థితులు ఉన్నాయని ఈటెల పేర్కొన్నారు. వందేమాతరం అన్నందుకు జైలుశిక్షలు విధించారని, జాతీయ జెండాను ఎగురవేసిన వారిపై కాల్పులు జరిపిన ఘటనలు చరిత్రలో నమోదయ్యాయని అన్నారు. ఆ కాలంలో పత్రికా స్వేచ్ఛ కూడా లేకపోయిందని, ప్రజాస్వామ్య హక్కుల కోసం అనేక మంది పోరాటం చేశారని వివరించారు.

తెలంగాణ విమోచన పోరాటంలో కొమరం భీమ్, దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ వంటి మహనీయుల పాత్రను ఈ సందర్భంగా స్మరించారు. జల్, జంగల్, జమీన్ కోసం కొమరం భీమ్ చేసిన పోరాటం, రైతుల హక్కుల కోసం జరిగిన ఉద్యమాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని చెప్పారు. స్వేచ్ఛ కోసం కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా ప్రజలు ఏకమై పోరాడిన విషయాన్ని యువత గుర్తుంచుకోవాలని సూచించారు. భారత స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి మహనీయుల త్యాగాలను కూడా ఈటెల ప్రస్తావించారు. దేశ స్వాతంత్ర్యం కోసం వారు ప్రాణాలను అర్పించారని, నేటి తరాలు ఆ త్యాగాల విలువను అర్థం చేసుకోవాలని అన్నారు. చరిత్రను తెలుసుకోవడం ద్వారా దేశభక్తి, సామాజిక బాధ్యత పెరుగుతాయని పేర్కొన్నారు.

పిల్లలకు విద్యతో పాటు దేశభక్తిని కూడా నేర్పించాల్సిన అవసరం ఉందని ఈటెల రాజేందర్ అన్నారు. చరిత్ర లేకుండా వర్తమానం లేదని, వర్తమానం లేకుండా భవిష్యత్తు ఉండదని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఈ ప్రదర్శన లక్ష్యమని చెప్పారు. తెలంగాణ విమోచన పోరాట గాథలను ప్రతి విద్యార్థి, యువకుడు తెలుసుకోవాలని పిలుపునిచ్చారు.

# యూపీఐపై కేంద్రం స్పష్టీకరణ విడుదల

- వ్యాపార లావాదేవీలపై స్వల్ప రుసుము
- వినియోగదారులకు సేవలు యథాతథ ఉచితం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ వ్యవస్థలో మర్చంట్ డిస్కౌంట్ రేట్ మార్పుల వెనుక విదేశీ శక్తుల ప్రభావం ఉందంటూ వస్తున్న ప్రచారాన్ని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. యూపీఐకు సంబంధించిన విధాన నిర్ణయాలన్నీ దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పూర్తిగా స్వతంత్రంగా తీసుకుంటున్నామని స్పష్టం చేసింది. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక ద్వారా విడుదల చేసిన ప్రకటనలో కేంద్రం తన వైఖరిని స్పష్టంగా వెల్లడించింది. విదేశీ ఒత్తిళ్లు లేదా బాహ్య ప్రభావాల ఆధారంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని తేల్చిచెప్పింది. 2016లో ప్రారంభమైన యూపీఐ వ్యవస్థ భారతీయ అవసరాలు, నిబంధనలు, సాంకేతిక సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చెందిందని కేంద్రం గుర్తుచేసింది. తక్కువ కాలంలోనే ఇది ప్రపంచంలోనే అతి పెద్ద తక్షణ చెల్లింపుల వ్యవస్థగా ఎదిగిందని పేర్కొంది. కోట్లాది మంది ప్రజలు రోజువారీ చెల్లింపుల కోసం దీనిపై ఆధారపడుతున్నారని తెలిపింది. 2026 ఆగస్టు నెలలో మాత్రమే 24.5 బిలియన్ల లావాదేవీలు నమోదు కావడం యూపీఐ విస్తరణకు నిదర్శనమని వివరించింది.

చెల్లింపుల వ్యవస్థను మరింత బలపరచడం, భద్రతను పెంచడం, సాంకేతికంగా అభివృద్ధి చేయడం కోసం అధిక విలువ గల కొన్ని వ్యాపార లావాదేవీలపై స్వల్ప రుసుము విధిస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఈ రుసుముల ద్వారా సమకూరే నిధులను మౌలిక వసతుల విస్తరణ, సైబర్ భద్రతా చర్యలు, గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహం వంటి కార్యక్రమాలకు వినియోగిస్తామని పేర్కొంది. చిన్న వ్యాపారులకు సాంకేతిక మద్దతు అందించడంలో కూడా ఈ నిధులు ఉపయోగపడతాయని తెలిపింది. యూపీఐ వినియోగదారులకు ఎలాంటి అదనపు భారం ఉండదని కేంద్రం పునరుద్ఘాటించింది. స్నేహితులకు డబ్బు పంపడం, దుకాణాల్లో చెల్లింపులు చేయడం, క్యూఆర్ సంకేతాలను స్కాన్ చేసి లావాదేవీలు నిర్వహించడం వంటి వ్యక్తిగత వినియోగ సేవలన్నీ గతంలాగే ఉచితంగానే కొనసాగుతాయని స్పష్టం చేసింది. నెలకు లక్ష రూపాయల వరకు యూపీఐ ద్వారా ఆదాయం పొందే చిన్న వ్యాపారులకు కూడా మినహాయింపు కొనసాగుతుందని తెలిపింది. దేశంలో జరిగే అధిక భాగం చెల్లింపులు చిన్న మొత్తాలవేనని, వాటిపై ఎలాంటి రుసుము ఉండదని వివరించింది.

రెండు వేల రూపాయలు దాటిన పెద్ద వ్యాపార లావాదేవీలపై మాత్రమే 0.4 శాతం మేర స్వల్ప రుసుము వర్తిస్తుందని కేంద్రం తెలిపింది. ఈ రుసుము కూడా వినియోగదారులు కాకుండా వ్యాపారులు మాత్రమే భరించాల్సి ఉంటుందని పేర్కొంది. ఇతర చెల్లింపు వ్యవస్థలతో పోలిస్తే ఇది చాలా తక్కువ స్థాయిలోనే ఉందని వివరించింది. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ దీర్ఘకాలిక స్థిరత్వం కోసం ఈ చర్యలు అవసరమని అభిప్రాయపడింది.

# అమెరికా బిల్లుతో భారత్‌కు సవాళ్లు



- రష్యా చమురు దిగుమతులపై దృష్టి
- 100 శాతం సుంకాల ప్రతిపాదన
- ప్రతినిధుల సభలో కీలక ముందడుగు

**వాషింగ్టన్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలపై కఠిన చర్యలకు అమెరికా సిద్ధమవుతోంది. రష్యా నుంచి భారీ స్థాయిలో చమురు, సహజవాయువు కొనుగోలు చేస్తున్న దేశాలపై దిగుమతి సుంకాలు విధించే అవకాశాన్ని కల్పించే కీలక బిల్లు అమెరికా ప్రతినిధుల సభలో ముందడుగు వేసింది. “లిండ్సే గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026” పేరుతో రూపొందించిన ఈ బిల్లుకు సంబంధించిన తీర్మానం స్వల్ప మెజారిటీతో ఆమోదం పొందడంతో తుది ఓటింగ్‌కు మార్గం సుగమమైంది.

ప్రతినిధుల సభలో జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 214 ఓట్లు, వ్యతిరేకంగా 211 ఓట్లు నమోదయ్యాయి. ఇద్దరు డెమొక్రాట్ సభ్యులు రిపబ్లికన్లకు మద్దతుగా ఓటు వేయడం బిల్లుకు కీలకంగా మారింది. దీంతో బుధవారం జరగనున్న తుది ఓటింగ్‌పై అంతర్జాతీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే అమెరికా సెనేట్ ఈ బిల్లును 8611 ఓట్ల భారీ ఆధిక్యంతో ఆమోదించింది. ప్రతినిధుల సభలో కూడా బిల్లు ఆమోదం పొందితే అది చట్టంగా మారనుంది. ఈ చట్టం ప్రకారం రష్యా నుంచి అత్యధికంగా చమురు లేదా సహజవాయువు కొనుగోలు చేస్తున్న ఐదు దేశాల నుంచి అమెరికాకు వచ్చే వస్తువులపై 100 శాతం వరకు దిగుమతి సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి లభిస్తుంది. దీంతో అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలపై కొత్త ఒత్తిడులు ఏర్పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

బిల్లులో భారత్ పేరును ప్రత్యక్షంగా ప్రస్తావించనప్పటికీ, ప్రస్తుతం రష్యా చమురు కొనుగోలుదారుల్లో భారత్ ప్రముఖ స్థానంలో ఉంది. చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా భారత్ టాప్5 దేశాల జాబితాలో కొనసాగితే ఈ నిబంధనల ప్రభావం పడే అవకాశం ఉందని అంతర్జాతీయ వాణిజ్య నిపుణులు చెబుతున్నారు. భారత్‌తో పాటు చైనా, అజర్‌బైజాన్, హంగేరి, స్లోవేకియా వంటి దేశాలు కూడా ఈ పరిధిలోకి వచ్చే అవకాశముంది. అయితే ఈ బిల్లులో మరో ముఖ్య అంశం కూడా ఉంది. ప్రత్యేక పరిస్థితుల్లో కొన్ని దేశాలకు మినహాయింపులు ఇచ్చే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కల్పించారు. దీంతో వ్యూహాత్మక భాగస్వామ్య దేశాల విషయంలో అమెరికా ప్రభుత్వం పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. అందువల్ల బిల్లు చట్టంగా మారిన వెంటనే అన్ని దేశాలపై ఒకే విధంగా చర్యలు అమలవుతాయనే పరిస్థితి ఉండకపోవచ్చని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఉక్రెయిన్ యుద్ధానికి నిధులు సమకూర్చుకుంటున్న రష్యా ఇంధన ఆదాయాన్ని తగ్గించడమే ఈ బిల్లుకు ప్రధాన ఉద్దేశమని దీని మద్దతుదారులు పేర్కొంటున్నారు. అలాగే రష్యా నాయకత్వం, ఇంధన రంగం, చమురు రవాణాలో ఉపయోగిస్తున్న నౌకలపై అదనపు ఆంక్షలు విధించే ప్రతిపాదనలు కూడా ఇందులో ఉన్నాయి. ఇరాన్‌పై ఇప్పటికే అమల్లో ఉన్న ఆంక్షలను మరింత కాలం కొనసాగించే నిబంధనలు కూడా చేర్చారు. గురువారం నుంచి ప్రతినిధుల సభ సమావేశాలు విరామంలోకి వెళ్లనున్న నేపథ్యంలో ఈ బిల్లు తుది ఫలితం అంతర్జాతీయంగా కీలకంగా మారింది.


# సర్పంచుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



- గ్రామ పంచాయతీ నిధుల ఫ్రీజింగ్ ఎత్తివేయాలన్న శ్రీనివాస్ గౌడ్
- సర్పంచుల గౌరవ వేతనం పెంచాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (తెలంగాణ ముచ్చట్లు):** సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, గ్రామ పంచాయతీల నిధులను ఫ్రీజ్ చేయకుండా వినియోగానికి అవకాశం కల్పించాలని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ-2026 ఆధ్వర్యంలో నిర్వహించిన సర్పంచుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని అన్ని శాఖలను సమన్వయం చేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత సర్పంచ్‌పై ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్, సాగునీరు, తాగునీరు, రైతుబంధు, పాఠశాలల సమస్యలు సహా ఏ అంశమైనా ప్రజలు ముందుగా సర్పంచ్‌నే ఆశ్రయిస్తారని చెప్పారు. రాష్ట్రానికి సచివాలయం ఎంత ముఖ్యమో, గ్రామానికి గ్రామ పంచాయతీ కూడా అంతే ముఖ్యమని వివరించారు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేశామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ప్రకృతి వనాలు, పార్కులు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు, ఇంటింటికీ నల్లా నీరు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశామని చెప్పారు. కేంద్ర నిధులకు రాష్ట్ర వాటా జోడించి గ్రామ పంచాయతీలకు నిధులు అందించడంతో పాటు సర్పంచులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చామని పేర్కొన్నారు. సర్పంచుల పోరాటం ఫలితంగా కొంతమేర పెండింగ్ బిల్లులు విడుదలయ్యాయని, అయితే ఇంకా భారీగా బిల్లులు, నిధులు బకాయిగా ఉన్నాయని అన్నారు. రాష్ట్ర జనాభాలో అధిక శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నందున గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని చెప్పారు. గ్రామ పంచాయతీల ఖాతాల్లో ఉన్న నిధులను కూడా వినియోగించకుండా ప్రభుత్వం ఫ్రీజ్ చేయడం సరైంది కాదని విమర్శించారు. సర్పంచుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, గ్రామ పంచాయతీ నిధులపై ఆంక్షలు తొలగించాలని, సర్పంచుల గౌరవ వేతనం పెంచాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణ ప్రకటించి ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ-2026 ప్రతినిధులు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.




Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in